

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX
RNI-APTEL/2023/88162

## 2036 ఒలింపిక్స్‌పై కేంద్రం ఫోకస్..

ఆతిథ్య బిడ్‌పై అమిత్ షా సమీక్ష



ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 233 | శుక్రవారం 28త - 08 -2026 | పేజీలు : 12 | వెల-3

## యూపీఐకి 10 ఏళ్లు..

**మోదీకి చంద్రబాబు అభినందనలు**

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వ్యవస్థ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. భారతదేశ డిజిటల్ చెల్లింపుల రంగంలో యూపీఐ ఒక అద్భుతమైన మైలురాయి అని, సామాన్యుడి జీవితంలో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని ఆయన కొనియాడారు. ఈ మేరకు ప్రధాని మోదీ చేసిన పోస్టుకు స్పందిస్తూ చంద్రబాబు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు.

మిగతా2లో



యూపీఐపై ప్రధాని మోదీకి మద్దతు తెలిపిన సీఎం చంద్రబాబు

సామాన్యుడి దైనందిన లావాదేవీలను యూపీఐ మార్చేసిందన్న సీఎం

చిరు వ్యాపారులు, మహిళలకు చెల్లింపులు సులభతరం చేసిందని వెల్లడి

భారత టెక్నాలజీ సామర్థ్యానికి యూపీఐ నిదర్శనమని కితాబు

## ఏపీ లిక్కర్ స్కామ్..

**సిట్, ఈడీ అధికారులతో ఐటీ అధికారుల కీలక సమావేశం!**

ఏపీ లిక్కర్ స్కామ్ లో రంగంలోకి దిగిన ఐటీ శాఖ

విదేశాలకు, బినామీ కంపెనీలకు నగదు మళ్లించినట్లు ఇప్పటికే గుర్తించిన దర్యాప్తు అధికారులు

చట్టపరమైన చర్యలు, దాడులకు సిద్ధమవుతున్న ఐటీ అధికారులు

వివరాలు2లో



## మంగళగిరిలో మోడరన్ రైతు బజార్..

**శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్**



మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరో కీలక ముందడుగు వేశారు. మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ సమీపంలో రూ. 18.55 కోట్ల అంచనా వ్యయంతో

మిగతా2లో

రూ.18.55 కోట్ల వ్యయంతో 5.90 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం

అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం

రిటైల్, హోల్ సేల్ స్టాళ్లు, కోల్డ్ స్టోరేజీతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా ఈ నిర్మాణం

## ఖేలో ఇండియా సంవాద్

**దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం**

**క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు**



2లో

# ఏం తినాలి ఎలా బతకాలి ?

## భగ్గుమంటున్న నిత్యావసరాల ధరలు

- ఏడాదిలో 50 శాతం పెరుగుదల
- బియ్యం, పప్పులు ధరలు పైపైకి
- సలసలమంటున్న వంటనూనెలు
- కూరగాయల ధరలకూ రెక్కలు
- ఆంధ్ర అన్నపూర్ణ జిల్లాలో కరువు పరిస్థితి

2లో




# నేపాల్‌లో జల ప్రళయం..

## 290 మంది భారతీయుల ఆచూకీ గల్లంతు



నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తడంతో ఘోర విషాదం చోటుచేసుకుంది. భోటే కోశి నదికి వచ్చిన ఆకస్మిక, ప్రచండ వరదల కారణంగా 290 మంది భారతీయులతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయని, వారి ఆచూకీ తెలియడం లేదని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ఆందోళన వ్యక్తం చేసింది. నేపాల్‌లో సంభవించిన ఈ ప్రకృతి విపత్తులో వందల మంది విదేశీయులు గల్లంతయ్యారు. విదేశాంగ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారిలో రసువా జిల్లాలోని త్రిశూలి-× జలవిద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 63 మంది భారతీయ కార్మికులు ఉన్నారు. వీరితో పాటు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తమిళనాడుకు చెందిన 21 మంది యాత్రికులు కూడా గల్లంతైన వారిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరోవైపు, వరదల నుంచి సురక్షితంగా బయటపడిన కొంతమంది భారతీయుల జాబితాను కూడా ఎంఈఏ విడుదల చేసింది. ఈ జల ప్రళయంతో రసువా, నువాకోట్ జిల్లాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి. నేపాల్ పోలీసుల సమాచారం ప్రకారం, నిన్న మధ్యాహ్నం నాటికి మొత్తం 644 మంది గల్లంతయ్యారు. వీరిలో 517 మంది విదేశీయులు కాగా, 127 మంది నేపాల్ స్థానిక పౌరులు ఉన్నారు. భారతీయులతో పాటు ఇతర దేశస్థులు కూడా పెద్ద సంఖ్యలో గల్లంతయ్యారు. బుధవారం నాటి వరదల తర్వాత నేపాల్‌లో సుమారు 100 మంది చైనా జాతీయుల ఆచూకీ తెలియడం లేదని చైనా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో 90 మంది అమెరికన్ పౌరులు చిక్కుకుని ఉండవచ్చని, వారిలో ముగ్గురిని సురక్షితంగా కాపాడామని యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.

నేపాల్‌లోని భోటే కోశి నదికి భారీ వరదలు

290 మంది భారతీయుల ఆచూకీ లేదన్న కేంద్రం

గల్లంతైన వారిలో తమిళనాడుకు చెందిన కైలాస యాత్రికులు

మొత్తం 517 మంది విదేశీయులతో పాటు 644 మంది ఆచూకీ గల్లంతు

2లో

సహాయక చర్యలు ముమ్మరం.. ఇప్పటివరకు 389 మృతదేహాలు లభ్యం

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు



**మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి**

**ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు**

**ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ** 2లో

**తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్**

లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు.

## నేపాల్ వరదల్లో చిక్కుకున్న వారిపై ఆరా

**ఎపి వాసుల క్షేమంపై నారా లోకేశ్ సమీక్ష**



2లో

## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు 2లో

ఏడుగురు మృతి...కొందరికి తీవ్ర గాయాలు

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రులు

తోణ సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు




పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు.

## అమరావతిలోని వీఐటీ-ఏపీ, ఆక్టేవ్ మధ్య కీలక ఒప్పందం



ఏఐ, ఎంఎల్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విద్యార్థులకు శిక్షణ

రెండేళ్ల కాలపరిమితితో వీఐటీ-ఏపీ, ఆక్టేవ్ మధ్య ఒప్పందం

విద్యార్థులకు నేరుగా లభించనున్న రియల్-టైమ్ అనుభవం 2లో

## నకిలీ వైద్యులపై కఠిన నిఘా.. హైదరాబాద్ లో 12 మంది అరెస్ట్.. సజ్జనార్ తీవ్ర హెచ్చరిక



2లో

# అమరావతిలోని వీఐటీ-ఏపీ, ఆక్టేవ్ మధ్య కీలక ఒప్పందం

అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం, ప్రముఖ సాంకేతిక సంస్థ 'ఆక్టేవ్' మధ్య రెండేళ్ల కాలపరిమితితో ఒక కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ వంటి వేగంగా ఎదుగుతున్న ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఆచరణాత్మక శిక్షణను అందించడమే ఈ భాగస్వామ్య ఒప్పందం ముఖ్య ఉద్దేశం. ఈ ఒప్పందంలో భాగంగా ఆక్టేవ్ సంస్థకు చెందిన నిపుణులైన మెంటార్లతో కలిసి విద్యార్థులు ప్రత్యక్షంగా ప్రాజెక్టులను రూపొందించనున్నారు. ప్రతి ప్రాజెక్టులోనూ ఒక ప్రొఫెసర్‌తో పాటు నలుగురు విద్యార్థులు, ఇద్దరు మెంటార్లు భాగస్వాములుగా ఉంటూ, మూడు నెలల నిర్ణీత వ్యవధిలో ప్రాజెక్టును పూర్తి చేసేలా ప్రణాళికను సిద్ధం చేశారు. దీనివల్ల విద్యార్థులకు రియల్-టైమ్ అనుభవం నేరుగా లభించనుంది. అంతేకాకుండా, మార్కెట్ అవసరాలకు తగినట్లుగా వీఐటీ-ఏపీలో మీ పాఠ్యాంశాల రూపకల్పనకు ఆక్టేవ్ సంస్థ తగిన సూచనలు, సలహాలు అందించనుంది. విద్యార్థులలో సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించేందుకు హ్యాకథాన్‌లు నిర్వహించడంతో పాటు, వారికి ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాల కల్పనలోనూ ఇరు సంస్థలు సంయుక్తంగా వ్యవహరించనున్నాయి. సాంకేతిక రంగానికి అవసరమైన ప్రతిభావంతులైన యువతను తీర్చిదిద్దడమే ఈ అవగాహన ఒప్పందం ప్రధాన లక్ష్యమని విశ్వవిద్యాలయ నిర్వాహకులు వెల్లడించారు.

# నకిలీ వైద్యులపై కఠిన నిఘా.. హైదరాబాద్ లో 12 మంది అరెస్ట్.. సజ్జనార్ తీవ్ర హెచ్చరిక

### నకిలీ వైద్యులపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

### విద్యార్హతలు లేని కొందరు డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారన్న సజ్జనార్

### నకిలీ డాక్టర్ల బారిన పడొద్దని ప్రజలకు హెచ్చరిక

వైద్యం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై హైదరాబాద్ నగర పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగరంలో కనీస అర్హతలు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 12 మందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకున్నామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. కనీస వైద్య విద్యార్హతలు, ఎలాంటి పరిజ్ఞానం లేని కొందరు వ్యక్తులు తాము డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, డయాబెటిస్ మందులను ఇస్తూ, ఇష్టారీతిన ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తున్నారని తెలిపారు. ఇటువంటి శాస్త్రీయత లేని వైద్యం వల్ల బాధితుల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు దెబ్బతిని ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా నకిలీ డాక్టర్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. క్లినిక్ లేదా ఆసుపత్రి రిసెప్షన్ వద్ద డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో కచ్చితంగా గమనించాలని తెలిపారు. అలాగే వైద్యుడి బోర్డుపై పేరు, చదివిన విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ వైద్యుడి అర్హతలపై కొద్దిగా అనుమానం వచ్చినా అధికారిక వెబ్‌సైట్ ద్వారా వివరాలు చెక్ చేసుకోవచ్చని, రికార్డుల్లో వివరాలు కనిపించకపోతే ఆ వైద్యుడిని నకిలీగా పరిగణించవచ్చని స్పష్టం చేశారు. తీసుకుంటున్న చికిత్సపై సందేహాలు ఉంటే వెంటనే అర్హత కలిగిన మరో డాక్టర్ వద్ద 'సెకండ్ ఒపీనియన్' తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఎవరైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే 'డయల్ 112' కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే నకిలీ డాక్టర్లపై నిరంతరం తనిఖీలు, కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ పక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు

# 2036 ఒలింపిక్స్‌పై కేంద్రం ఫోకస్..

### 2036 ఒలింపిక్స్ బిడ్డింగ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమీక్ష

### అహ్మదాబాద్ వేదికగా పలు అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు ప్లాన్

### 2030 కామన్వెల్త్, 2029 పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌పై కూడా చర్చ

### భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ డెస్టినేషన్‌గా మార్చడమే లక్ష్యమన్న అమిత్ షా

### సన్నాహకాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న హోంమంత్రి

భారత్‌లో అంతర్జాతీయ క్రీడా సంబరాలకు రంగం సిద్ధమవుతోంది. 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఆ దిశగా సన్నాహకాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఒలింపిక్స్ బిడ్డింగ్ ప్రక్రియ పురోగతిని, క్రీడల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. ఒలింపిక్స్‌తో పాటు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2029లో జరగనున్న పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌ను కూడా అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశం అనంతరం అమిత్ షా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లను నిర్వహించడం ద్వారా భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ డెస్టినేషన్‌గా నిలబెట్టడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, క్రీడా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, గుజరాత్ ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. అహ్మదాబాద్‌లో క్రీడల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లపై అధికారులు అమిత్ షాకు వివరించారు. ఇటీవల గ్లాస్గోలో 2026 కామన్వెల్త్ గేమ్స్ ముగిసిన తర్వాత, తదుపరి ఆతిథ్య నగరంగా అహ్మదాబాద్ తరఫున గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ కామన్వెల్త్ గేమ్స్ పతాకాన్ని అందుకున్న విషయం విదితమే.

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయవాడ నుంచి తిరుపతి

వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆటోను ఢీకొని ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంరతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రైవేటు ట్రావెల్స్ వాహనాల రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు హోంమంత్రి అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి చెందారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ.. మృతుల కుటుంబాలకు పల్లా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోడ్డు ప్రమాద మృతదేహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ప్రమాద ఘటనపై పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. చిలకలూరిపేట పట్టణంలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడు జరగలేదని.. ప్రమాదంలో ఏడుగురు చనిపోవడం తనను కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు.

# ఏం తినాలి ఎలా బతకాలి ?

నిత్యావసర వస్తువులు కొండెక్కి కూర్చున్నాయి. పప్పులు, వంటనూనెలు, బియ్యంతో పాటు ఇతర వంటింటి సరుకుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. పేద, మధ్య తరగతి కుటుంబాల వంటింట్లో ధరల మంట రాజుకుంటోంది. కారణాలేమైనా సామాన్యులు బతికే పరిస్థితి కనిపించడం లేదు.. ఏం తినాలి.. ఎలా బతకాలి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధర లకు రెక్కలు వచ్చాయి. ఆంధ్ర అన్నపూర్ణగా వెలుగు వెలిగిన పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలో బియ్యం ధరలు ఎగబాకాయి. ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరి, మరోవైపు ధరల స్థిరీకరణ మండలి నిర్లక్ష్య ధోరణితో ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దశా బ్దకాలంతో పోలిస్తే ఆగస్టు నాటికి నిత్యా వసరాల ధరలు 50 నుంచి 110 శాతం పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ఉల్లి ధర 110 శాతం పెరగ్గా, వంటనూనెల ధరలు 100 శాతం, వివిధ పప్పుల ధరలు సగటున 80 శాతం పెరి గాయి. అంటే సరాసరి పదేళ్లకాలంలో 100 శాతం ధరలు పెరిగాయి. ఇటీవల ధరలు అనూ హ్యంగా పెరుగుతూ వచ్చాయి. గత ఫిబ్రవరి మాసాంతం నుంచి ఆగస్టు ఆరంభం నాటికి 16 రకాల కీలక ఆహారపదార్థాల రేట్లు అనూహ్యంగా పెరిగాయి. కందిపప్పు కిలోకు రూ.6 పెరగ్గా, మినపప్పు కిలోకు రూ.5, శనగపప్పు రూ.5, వంట నూనెలు లీటరుకు రూ.8 నుంచి 10 వరకూ పెరిగాయి. ధరలు పెరగడానికి కారణం వంటనూనెలకు అంత ర్జాతీయ పరిస్థితులు తోడయ్యాయి. అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్ యుద్ధం నేపథ్యంలో హార్మోజ్ జలసంధి మూతబడటంతో వంటనూనెల ధరలు పెరిగాయి. డీజిల్, పెట్రోలు ధరలు పెరగడంతో ట్రాన్స్‌పోర్టు వ్యయం పెరిగి కిలోకు 50 పైసలు నుంచి రూపాయి వరకూ ధరలు పెరుగుతూ వచ్చాయి. **ఎల్‌నినో ప్రభావం** బలహీన రుతుపవనాలు, ఎల్‌నినో తీవ్ర ప్రభావం కారణంగా వర్షాలు లేక పంట విస్తీర్ణం తగ్గింది. జిల్లా పరిస్థితి చూస్తే 54 శాతం వర్షపాతం తగ్గుదల కనిపి స్తోంది. 32 శాతం తక్కువ వర్షపాతం ఉండగా, తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల్లో మన జిల్లా రెండో స్థానంలో ఉంది. జిల్లాలో గత జూలై, ఆగస్టు నెలల్లో వర్షపాతం ఎక్కువ ఉండి కూరగాయల పంటలు దెబ్బతినగా, ఇప్పుడు వర్షాలు లేక కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. జిల్లాలో బియ్యం వినియోగం ఇటీవల గణ నీయంగా తగ్గినప్పటికీ ధరలు మాత్రం పెరు గుతూనే ఉన్నాయి. సన్నబియ్యం ధర రెండునెలల్లో కిలోకు రూ.10 పెరిగింది. వంటనూనెల పరిస్థితి అదేవిధంగా ఉంది. రైతు బజార్లలో సబ్సిడీపై కూర గాయలు ఇవ్వడమేకాక, మొబైల్ రైతుబజార్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నిత్యావసరాల ధరలపై జీఎస్టీ తగ్గించి నప్పటికీ ఫలితం కాన రానందున మొత్తం జీఎస్టీ తొలగించాలని వినియోగదారులు కోరుతున్నారు.

**ఎరువుల సంక్షోభం** గల్ఫ్ యుద్ధం ప్రభావంతో ఎరువుల ధరలు కూడా 30 శాతం మించిపోయింది. ప్రధాన ఎరువు యూరియా ధర టన్నుకు 510 డాలర్ల నుంచి 950 డాలర్లకు ఎగ బాకింది. ఈ ప్రభావాలతో వచ్చే త్రైమాసికం నాటికి ధరలు మరింత పెరుగుతాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. దీనికితోడు జిల్లాలో టోకు వర్తకులు ఎల్‌నినో ఉపద్రవాలను ముందుగానే అంచనావేసి పెద్దఎత్తున అపరాలను నిల్వచేసి బ్లాక్‌మార్కెట్‌కు తరలి స్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వచ్చే నవంబరు, డిసెంబరు నెలల నాటికి వాతావరణం మరింత వేడెక్కి వరితోపాటూ, పైరు పంటలు, కూరగాయలు పండే పరిస్థితి ఉండదని అంచనా వేయడంతో టోకు వర్తకులు ముందుగానే పెద్దఎత్తున ఆహార ఉత్పత్తుల నిల్వలు పెంచుకుంటూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు.

# మంగళగిరిలో మోడరన్ రైతు బజార్..

నిర్మించనున్న అత్యాధునిక 'మోడరన్ రైతు బజార్' నిర్మాణ పనులకు ఆయన గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. సుమారు 5.90 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించనున్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. స్థానిక ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ రిటైల్, హోల్ సేల్ కూరగాయల మార్కెట్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారు. మొత్తం 71,925 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందులో రిటైల్ మార్కెట్ విభాగంలో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల కోసం 54 స్టాళ్లను కేటాయించారు. అలాగే, హోల్ సేల్ మార్కెట్ విభాగంలో 23 దుకాణాలు, 18 అన్‌లోడింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు కోల్డ్ స్టోరేజీ, కూరగాయలు ప్రక్షాళన కేంద్రాలు, క్యాంటీన్, వాహనాల పార్కింగ్ వంటి అత్యాధునిక సదుపాయాలను ఇక్కడ కల్పించనున్నారు. శంకుస్థాపన కార్యక్రమం నిమిత్తం విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మార్కెట్ నమూనాను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక టీడీపీ ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# యూపీఐకి 10 ఏళ్లు.. మోదీకి చంద్రబాబు అభినందనలు

"గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారూ, మీరు చెప్పింది అక్షర సత్యం. నా వ్యక్తిగత అనుభవం ద్వారా చెబుతున్నాను.. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా ప్రజల ఆర్థిక లావాదేవీల స్వరూపాన్ని యూపీఐ సమూలంగా మార్చివేసింది. వీధి వ్యాపారులు, మహిళా పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారులు, విద్యార్థులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి జీవితంలో ఇది భాగమైపోయింది. దైనందిన లావాదేవీలను ఇది ఎంతో సులభతరం చేసింది. ప్రపంచానికి భారత సాంకేతిక సత్తాను చాటిచెప్పిన ఈ మైలురాయిని చేరుకున్న సందర్భంగా ప్రతి భారతీయుడికి అభినందనలు" అని చంద్రబాబు పేర్కొన్నారు. అంతకుముందు, యూపీఐ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ పోస్ట్ చేశారు. "భారత డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో యూపీఐ ఒక కీలక మలుపు. దీని విస్తృతి, స్థాయి ప్రతి భారతీయుడికి గర్వకారణం" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు.

# ఏపీ లిక్కర్ స్కామ్.. సిట్, ఈడీ అధికారులతో ఐటీ అధికారుల కీలక సమావేశం!

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఆదాయపు పన్ను శాఖ రంగంలోకి దిగడంతో దర్యాప్తు కొత్త మలుపు తిరిగింది. ఈ కుంభకోణంలో అక్రమంగా కొల్లగొట్టిన నిధుల మూలాలు, వాటి మళ్లింపుపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు. మనీ ట్రయల్‌కు సంబంధించిన కీలక వివరాలను సేకరించేందుకు హైదరాబాద్ వేదికగా సిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులతో ఐటీ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. షెల్ కంపెనీలను సృష్టించి కోట్లాది రూపాయల నగదును విదేశాలకు మళ్లించినట్లు దర్యాప్తు అధికారులు ఇదివరకే గుర్తించారు. ముఖ్యంగా దుబాయ్ సహా పలు ఇతర దేశాలకు, బినామీ కంపెనీలకు ఈ సొత్తును తరలించినట్లు తేలడంతో... ఆయా కంపెనీల నెట్‌వర్క్, వాటి వెనుక ఉన్న అసలు సూత్రధారులపై ఐటీ దృష్టి సారించింది. అసలు, నిధులు ఏ ఏ ఖాతాల గుండా ఎక్కడికి చేరాయి, విదేశీ ఖాతాలకు, బినామీ సంస్థలకు సొమ్మును ఏ రూపంలో తరలించారనే అంశాలపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. ఈ దర్యాప్తు ప్రక్రియలో భాగంగా ప్రధాన నిందితులు, డొల్ల కంపెనీల జాబితా, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల వివరాలను ఐటీ అధికారులు తీసుకున్నారు. ఈ కుంభకోణంతో పరోక్షంగా ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తులు, ఆర్థిక లావాదేవీలకు సహకరించిన శక్తుల సమాచారాన్ని కూడా సేకరిస్తున్నారు. సిట్, ఈడీ అందించిన ఆధారాలు, నివేదికల ఆధారంగా త్వరలోనే సంబంధిత వ్యక్తులు, సంస్థలపై కఠిన చట్టపరమైన చర్యలు, దాడులకు ఆదాయపు పన్ను శాఖ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# ఖేలో ఇండియా సంవాద్

దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారంనిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అ÷-లథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిధ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

# నేపాల్ వరదల్లో చిక్కుకున్న వారిపై ఆరా

నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ యాత్రికుల క్షేమ సమాచారాలపై మంత్రి నారా లోకేశ్ సమిక్ష నిర్వహించారు. నేపాల్‌ల్లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రికుల గురించి అడిగి తెలుసుకున్నారు. నలుగురు సురక్షితంగా ఉన్నారని.. మరో ముగ్గురి ఆచూకీ లభ్యం కాలేదని మంత్రికి ఏపీ ఢిల్లీ భవన్ అధికారులు తెలియజేశారు. కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ గ్రూప్‌కు చెందిన శశికుమార్, రాజ్యలక్ష్మీల ఆచూకీ లభించలేదని వెల్లడించారు. కనిపించకుండా పోయిన ముగ్గురి ఆచూకీని కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని లోకేశ్ సూచించారు. చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద ఈషా ఫౌండేషన్ సభ్యుడు శశికుమార్ చివరిసారిగా కనిపించినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు.. కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్నా.. క్షేమంగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు. సురక్షితంగా ఉన్న వారిని వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. యాత్రికుల భద్రతపై భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని మంత్రి లోకేశ్ సూచనలు చేశారు. నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికులు, మానస సరోవర్ యాత్రకు వెళ్లిన ఏపీ వాసుల సమాచారాన్ని ఆర్టీజీఎస్ అధికారులు తెలుసుకుంటున్నారు. మంత్రి లోకేశ్ సూచనల మేరకు ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# నేపాల్‌లో జల ప్రళయం..

ఇప్పటివరకు ఏ అమెరికన్ పౌరుడు మరణించినట్లు తమకు సమాచారం లేదని పేర్కొంది. గల్లంతైన వారిలో 53 మంది ఉక్రేనియన్లు, 51 మంది మలేషియన్లు, 35 మంది ఆస్ట్రేలియన్లు, 33 మంది బ్రిటన్ వాసులు, 25 మంది కెనడియన్లతో పాటు పలు దేశాల పౌరులు ఉన్నారు.

## సుమేధా విద్యా సంస్థల విద్యార్థులు తైక్వాండో లో ఘన విజయం.

**18 పథకాలతో సత్తా చాటిన విద్యార్థులు.**

**హర్షం వ్యక్తం చేసిన సుమేధా విద్యాసంస్థల యాజమాన్యం.**



**బేతంచెర్ల ఆగస్టు 27 ( నందిపత్రిక ).** బేతంచెర్ల పట్టణం లోగల సుమేధ విద్యాసంస్థల విద్యార్థులు తైక్వాండో పోటీలలో ఘన విజయం సాధించారు.నంద్యాలలో నిర్వహించిన 1వ వెస్ట్ ఆంధ్ర జోనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్2026 లో సుమేధ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి,మొత్తం 18 పతకాలు సాధించి ఘన విజయం సాధించారు.ఈ పోటీలలో విద్యార్థులు 5 బంగారు పతకాలు,3 రజత పతకాలు,9 కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకారుల పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనకు ఈ విజయం నిదర్శనంగా నిలిచింది.విద్యార్థుల ఈ విజయానికి మార్గదర్శకత్వం వహించిన కోచ్ బి.వెంకటేశ్వర్లు మరియు కోచ్ శ్రీ నాగన్నలను పాఠశాల యాజమాన్యం అభినందించింది.విజేతలందరికీ సుమేధ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ తరఫున హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.భవిష్యత్తులో కూడా విద్యార్థులు మరిన్ని క్రీడా విజయాలు సాధించి పాఠశాలకు,తల్లిదండ్రులకు మరియు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలియ జేస్తూ, మీ విజయం మరెందరో విద్యార్థులకు స్ఫూర్తి కావాలనిసుమేధ ఎడ్యు కేశనల్ ఇన్ స్ట్యూషన్స్ ఆకాంక్షించారు.

## ప్రభుత్వ పాఠశాలకు ఫెన్సింగ్ ఏర్పాటు



**మద్రిపాడు ఆగస్టు 27 నంది పత్రిక** :ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు చేయూతనిస్తే విద్యార్థులకు మెరుగైన వసతులు అందుతాయనే దానికి కృష్ణాపురం బీసీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ నిదర్శనంగా నిలిచింది.గ్రామానికి చెందిన దాత,చెన్నైలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న బేరి బ్రహ్మానందరెడ్డి సుమారు రూ.50 వేల సొంత నిధులు వెచ్చించి పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు.పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు తరచూ ఆవరణలోకి ప్రవేశించి అపరిశుభ్రతకు కారణమయ్యేవి.దీంతో విద్యార్థులకు అసౌకర్యం,భద్రతాపరమైన ఇబ్బందులు ఎదురయ్యేవి.ఈ సమస్యను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబశివారెడ్డి,ఉపాధ్యాయుడు రాధాకృష్ణారెడ్డి మరియు గ్రామస్తులు బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.వారి విజ్ఞప్తికి వెంటనే స్పందించిన బేరి.బ్రహ్మానందరెడ్డి పిల్లల భద్రత,పాఠశాల పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని సొంత నిధులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు.దీంతో విద్యార్థులకు పరిశుభ్రమైన,సురక్షితమైన వాతావరణం అందుబాటులోకి వచ్చింది.విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలనే సేవాభావంతో ముందుకొచ్చిన బ్రహ్మానందరెడ్డిని పాఠశాల సిబ్బంది,విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామస్తులు అభినందించారు.ప్రభుత్వ పాఠశాలలను సొంత పాఠశాలలుగా భావించి దాతలు ముందుకు వచ్చి మౌలిక వసతుల కల్పనకు సహకరించడం అభినందనీయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## కడప పట్టణం, శ్రీహరి డిగ్రీ కాలేజ్ నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" నాటక ప్రదర్శన



**కడప ఆగష్టు 27:** జిల్లా ఎస్పీ శ్రీ నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ వారి ఆదేశాల మేరకు గురువారం ఉదయం కడప పట్టణం శ్రీహరి డిగ్రీ కాలేజ్ నందు "పోలీస్-కళా-జాగృతి బృందం" ఇన్‌చార్జ్ జి.నరసరామ్ మరియు టీమ్ చే 'ఓయువతా... మేలుకో" పాటల, నాటిక ప్రదర్శన ద్వారా మాధకద్రవ్యాలపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా కడప ఫ్యాక్షన్ జోన్ యస్.ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేటి సమాజంలో యువత "డ్రగ్స్"కు దూరంగా ఉండి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాలు వాడిన, అమ్మిన, ఆశ్రయం కల్పించిన దానికి తగిన శిక్షలు గురించి తెలియజేశారు. మత్తు పదార్థాల ఆచూకీ తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కి కాల్ చేసి తెలియజేయాలన్నారు.కడప ఫ్యాక్షన్ జోన్ ఉమెన్ యస్.ఐ లక్ష్మీదేవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మీతల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చి సమాజానికి ఉపయోగ పడాలని హితువు పలికారు. ప్రిన్సిపాల్ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ మత్తుపదార్థాల వాడకంవల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, సమాజంలోని రుగ్మతలు వాటివలన కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు."పోలీస్-కళా-జాగృతి బృందం" ఇన్‌చార్జ్ జి.నరసరామ్ విద్యార్థులచే "యువతా మేలుకో-మత్తు నుండి తేరుకో, డ్రగ్స్ వద్దు- జీవితం ముద్దు, మత్తుపదార్థాలకు దూరంగా ఉందాం- భవిష్యత్తును కాపాడుకుందాం" అని నినాదాలు చేయించారు.

**"పోలీసు కళా-జాగృతి బృందం" ప్రదర్శన విద్యార్థులను అలరించింది.** ఈకార్యక్రమంలో కాలేజ్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మరియు కళాబృందం సభ్యులు సుశీల, మేషక్, ఉదయ్, శ్రీరామ్, మధు, కరుణాకర్ పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం కోతల, కూతల, వాతల ప్రభుత్వం.



**నంది ప్రతినిధి ఆగస్టు 27, కడప జిల్లా** చంద్రబాబు నేతంలోని కూటమి ప్రభుత్వం కోతల కోతల వాతల ప్రభుత్వం గా తయారైందని రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెరెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం కడప కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమిపాలనతో నిత్యవసర సరుకులు అన్నారు. ఏమి కొనేటట్టు లేదు ఏమి తినేటట్లు లేదు అన్న పరిస్థితి దాపురించింది అన్నారు. కాంగ్రెస్ పాలనలో జేబులో డబ్బులు వేసుకుని మార్కెటింగ్ పోయి సంచిలో సరుకులు తెచ్చుకుని వారిని, ప్రస్తుతం సంచిలో డబ్బులు వేసుకుని మార్కెట్ కు పోయి జేబులో సరుకులు తెచ్చుకుని దుస్థితి దాపురిచ్చిందన్నారు. గృహిణి వంటగదిలోనికి పోవాలంటే భయపడిపోతున్నారు బియ్యము కందిపప్పు వంట నూనెలు ఎండుమిరప చింతపండు చెక్కర ఇలా ప్రతి వస్తువు ధర ఈ ఏడాది కాలం 40 శాతం నుండి 70 శాతం వరకు పెరిగింది అన్నారు నిత్యవసర ధర తగ్గించేందుకు వెంటనే కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని తొలిసారి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఒకవైపు విద్యుత్ ఛార్జీలు పెంచలేదంటూని మరొకవైపు విద్యుత్ సర్దుబాటు చార్జీలు పేరుతో 21, 243 కోట్ల రూపాయలు అదనపు భారం విద్యుత్ వినియోగదారుల మీద కూటమి ప్రభుత్వం మోపింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ మీద పెంచే ఎనిమిది రూపాయల ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం విజయకుమార్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, నగర అధ్యక్షుడు గౌస్ పీర్, జిల్లా కోశాధికారి హరిప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు కోటపాటి లక్ష్మయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు గంగయ్య, జిల్లా కార్యదర్శి ఏకాదశి రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీ, మామిళ్ళ బాబు పాల్గొన్నారు

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి

**-క్యూఆర్ కోడ్ పద్ధతిని రద్దు చేయండి**



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 27 . (నంది పత్రిక ):**రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని, క్యూఆర్ కోడ్ పద్ధతిని రద్దు చేయాలని నంద్యాల జిల్లా అధ్యక్షులు ఆకుమల్ల బ్రహ్మయ్య ,రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ మొహమ్మద్ యూనిస్ లు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రేషన్ డీలర్ సంక్షేమ సంఘం పిలుపుమేరకు సెప్టెంబర్ 2026 నెలకు సంబంధించిన లిఫ్టింగ్ మరియు పంపిణీ ప్రక్రియలో నూతనంగా క్యూఆర్ కోడ్ సిస్టం ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగింది. ఈ యొక్క కొత్త విధానం వల్ల రేషన్ డీలర్ పైన ఆర్థిక భారం మరియు పని కూడా పెరగడం జరుగుతుంది మరియు పంపిణీ చేసే సమయంలో కార్డుదారులకు కూడా రేషన్ సర్కుల్ పంపిణీ చేయడానికి ఆలస్యం అవుతుంది.దానివల్ల డిస్ట్రిబ్యూషన్ కూడా లేట్ అవ్వడం జరుగుతుంది.కావున రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు గురువారం మండల్ లెవెల్ తాసిల్దార్ అధికారులకి వినతి పత్రం అందించడం జరిగింది.ఈ యొక్క వేదిపాత్రంలో ముఖ్యంశాలు చాలీచాలని కమిషన్ తో డీలరు చానా ఏళ్లుగా ఆర్థిక భారం మోస్తున్నారు.దానికి విముక్తి విముక్తి కలిగించి రేషన్ డీలర్ యొక్క కమిషన్ కింటాకి వంద రూపాయలు నుండి 300 రూపాయల వరకు పెంచవలసిందిగా మరియు డీలర్ కి ఆర్థిక భారం లేకుండా వాటికి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని మరియు నూతనంగా క్యూఆర్ కోడ్ సిస్టం అమలు చేసిన విధానాన్ని తక్షణమే మార్చి అనుకూలమైన విధానాన్ని ప్రవేశపెట్టి కంపెనీ సమయంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా నంద్యాల తహసిల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరుగుతుంది.ఈ యొక్క కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు ఆకుమల్ల బ్రహ్మయ్య ,రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ మొహమ్మద్ యూనిస్,నంద్యాల టౌన్ కార్యదర్శి షేక్ అప్సర్ భాష, మండలానికి చెందిన డీలర్స్ అందరూ హాజరు కావడం జరిగింది .

## జిల్లెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి**

**జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**



**గోస్పాడు , ఆగస్టు 27(నంది పత్రిక):** గోస్పాడు మండలం, జిల్లెల గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. అవుట్ పేషెంట్ (ఓపి), ఇన్ పేషెంట్ (ఐపీ) విభాగాలతో పాటు ల్యాబ్‌ను పరిశీలించారు. ల్యాబ్‌లో అందుబాటులో ఉన్న సదుపాయాలను తనిఖీ చేయడంతో పాటు, రోగుల హిమోగ్లోబిన్ శాతాన్ని స్వయంగా పరీక్ష చేయించి, సంబంధిత వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పి.హెచ్.సి.లో వైద్య సేవలకు సంబంధించిన వివరాలను ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ ద్వారా ఏ విధంగా నమోదు చేస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య శాఖ నిర్దేశించిన 21 కీలక పనితీరు సూచికలు (కేపీఎస్) సాధనలో పురోగతిపై సమీక్షించారు.ఆసుపత్రికి వచ్చిన రోగులతో జిల్లా కలెక్టర్ స్వయంగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక కేంద్రంలో ఉచిత వైద్యం, మందుల పంపిణీ సంతృప్తికరంగా కొనసాగుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, డాక్టర్ కే.సి. శ్రీనివాసులు, సూపర్‌వైజర్ సుబ్బారెడ్డి, స్టాఫ్ నర్స్ శశికళ, ల్యాబ్ టెక్నీషియన్‌తో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరెడ్డి.



**నంది ప్రతినిధి, ఆగస్టు 28, కడప జిల్లా.** కడప నగరంలోని 21 డివిజన్ ఎర్రముక్కపల్లి నుంచి నిర్వహించిన ఇంటింటికీ తెలుగు దేశం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవరెడ్డి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు వారి నాయకత్వంలో రెండేళ్లుగా కూటం ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సాధించిన విజయాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. అలాగే ప్రభుత్వ పాలన విజయాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ప్రజలతో ముచ్చటిస్తూ వారి సమస్యలను అభిప్రాయాలను తెలుసుకొని ప్రజా సంక్షేమ మరియు కడప అభివృద్ధికి ప్రభుత్వ నిరంతరం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు



**కడప నంది పత్రిక ప్రతినిధి ఖాజీపేట, ఆగస్టు 27:** వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బత్తల సుబ్బరాయుడు యాదవ్ ఆధ్వర్యంలో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి 42వ జన్మదిన వేడుకలను ఖాజీపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టిపల్లి సిద్ధారెడ్డి, మాజీ కేఏసీ కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.బి. కొండారెడ్డి, ఖాజీపేట యువత అధ్యక్షుడు ఎం. రమణ, పత్తూరు శివ ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.అలాగే ఏటూరు మాజీ సర్పంచ్ రాజాగోపాల్, పత్తూరు మాజీ ఎంపీటీసీ గాలిపోతు మనోహర్, మిడుతూరు మాజీ సర్పంచ్ చంద్ర, చెమళ్లపల్లి మాజీ సర్పంచ్ బుజ్జి, వేమారెడ్డి, రాజారెడ్డి, పోలు నారాయణరెడ్డి తదితరులు పాల్గొని అవినాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

## కడప పార్లమెంట్ సభ్యులు కడప పార్లమెంటు సభ్యులు, కడప యువరాజ్ వైయస్ అవినాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు.





కడప జిల్లా వైయస్సార్ సిపి పార్టీ కార్యాలయం ఆధ్వర్యంలో బీహెచ్ ఇలియాస్ భాష వారి ఆధ్వర్యంలో వారికి కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం ఎస్. బి ఆంజర్ భాష, మాజీ టిడిపి బోర్డు సభ్యులు మాసింబాబు, కడప మహిళా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ, కడప బీసీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఫుల్ సునీల్ కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, మాజీ మేయర్ పాక సురేష్, కడప ఎస్సీ సెల్ అధ్యక్షులు బాబు, ఈ కార్యక్రమంలో విచ్చేసిన ఇతర నాయకులు, నాయకు రాళ్లు, మరియు పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్యకర్తలు అందరూ వైఎస్ అవినాష్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు

## ఆదర్శ పాఠశాలలో పోలీసుల అవగాహన సదస్సు



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 27:** మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపరాదని ఎస్ఐ జగన్మోహన్ పేర్కొన్నారు. గురువారం బండి ఆత్మకూరులోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న అమ్మాయిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన చట్టాల గురించి ఎస్ఐ వారికి వివరించారు. పాఠశాలకు లేదా కాలేజీకి వచ్చే సమయంలో ఇంటి దగ్గర ఏదైనా ఎవరి వలన అయినా ఇబ్బందులు తలెత్తితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఏదైనా సమస్యలు ఉంటే ఎస్ ఐ ఫోన్ నెంబర్ తో పాటు మహిళా హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి ఫోన్ నెంబర్ కూడా విద్యార్థినులకు ఇవ్వడం జరిగింది. తర్వాత కళాశాల విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులు మైనర్లు కాబట్టి బైక్ డ్రైవింగ్ చేయరాదని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాలలో ఏడు ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించారు. ద్విచక్ర వాహనాలకు సంబంధించిన తండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం వారి బైకులు వారికి ఇవ్వడం జరుగుతుందని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆబుదూర్ రాఫీ, సిబ్బంది, కానిస్టేబుల్ శివలింగం తదితరులు పాల్గొన్నారు.

# ఏ కోడూరులో కూటమి పాలనపై ఇంటింట ప్రచారం





**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 27:** రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకుగాను బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు మధుసూదన్ రెడ్డి గురువారం ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అమలు చేయడం జరిగిందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ పంపిణీ, వృద్ధాప్య పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ లాంటి సంక్షేమ పథకాలను పేద ప్రజలకు, రైతులకు అందజేయడం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాబోవు రోజుల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు మద్దతు తెలిపాలని మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రామంలో 183,184,185 బూతులకు సంబంధించి ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ఇందుకు సహకరించిన ప్రజలందరికీ మధుసూదన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

**డెంగ్యూ బాధితుడికి ఆర్థిక సాయం**

ఏ కోడూరు గ్రామంలో డెంగ్యూ వ్యాధికి గురైన బాధితుడికి మధుసూదన్ రెడ్డి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక ఎస్సీ కాలనీ టిడిపి నాయకుడు సుబ్రహ్మణ్యం సోదరుడైన వెంకటసుబ్బయ్య గత కొద్ది కాలం నుండి డెంగ్యూ వ్యాధికి గురై చికిత్స కోసం ఆర్థికంగా నష్టపోవడం జరిగిందని తెలుస్తోంది. గురువారం వెంకటసుబ్బయ్య ఇంటికి వెళ్లిన మధు అతనికి ఐదువేల రూపాయల నగదును అందజేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం మంజూరు చేయిస్తానని మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. తనకు ఆర్థిక సాయం అందజేసిన మధుసూదన్ రెడ్డికి బాధితుడు వెంకటసుబ్బయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

# నంద్యాలలో అర్ధరాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

**శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యం.....**

**రాత్రి వేళలో అనవసరంగా తిరిగే ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు....**

**రౌడీ షీటర్ల కదలికలపై నిఘా కొరకు రాత్రి వేళలో వారి ఇంటి వద్ద తనిఖీ చేయాలి....**

**నంద్యాల క్రైం, ఆగష్టు27(నంది పత్రిక):-** నంద్యాల జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టంగా పరిరక్షించడంతో పాటు అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ రాత్రివేళ నంద్యాల పట్టణ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్వయంగా మోటార్ సైకిల్‌పై రాత్రివేళ పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో పర్యటిస్తూ పోలీసుల రాత్రి గస్తీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులు, రాత్రి వేళల్లో అనవసరంగా తిరుగుతున్న ఆకతాయిలు, సమయపాలన పాటించని వ్యాపార సముదాయాలను పరిశీలించారు. రౌడీ షీటర్ల పై నిఘా కొరకు వారి ఇళ్లను తనిఖీ చేయడం జరిగింది. నంద్యాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ సెంటర్, గాంధీ చౌక్, బంగారు అంగళ్ల వీధి, హరిజన పేట పెద్ద బండ, బాలాజీ కాంప్లెక్స్, ఆర్టీసీ బస్టాండ్, విక్టోరియా రీడింగ్ రూమ్, బైరమల్ వీధి తదితర ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి పరిస్థితులను పరిశీలించారు. రాత్రి వేళల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు మరియు ఇతర ప్రజలు భయాందోళనలకు గురికాకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. రాత్రి సమయంలో అనవసరంగా సంచరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఆకతాయిలపై నిఘా ఉంచి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నిర్దేశిత సమయాలను పాటించకుండా నిర్వహించే వ్యాపార సముదాయాలు, బార్లు, వైన్ షాపులు తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే సంబంధిత శాఖల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. రాత్రివేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేసి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ప్రజలకు భద్రతపై నమ్మకం కలిగించే విధంగా పోలీసులు అందుబాటులో ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలను ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ తెలిపారు. ఎస్పీతో పాటు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.



# క్యూ ఆర్ కోడ్ విధానాన్ని సమీక్షించాలంటూ వినతి



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 27 :** రేషన్ డీలర్లను మనోవేదనకు గురి చేస్తున్న క్యూ ఆర్ కోడ్ విధానాన్ని సమీక్షించి అమలు చేయకుండా నిలిపివేయాలని బండి ఆత్మకూరు మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగరాజు విజ్ఞప్తి చేశారు. గురువారం డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై బండి ఆత్మకూర్ తాసిల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు మండల డీలర్లు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ, డీలర్లకు చాలామందికి ఆండ్రాయిడ్ మొబైల్స్ అందుబాటులో లేకపోవడం వల్ల ఈ స్కానింగ్ చేసే సమయంలో యాప్ను డౌన్లోడ్ చేసుకునే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ప్రతినెలా అనాధికారికంగా ప్రతి రేషన్ డీలర్ తనకు ఉన్న అలాట్మెంట్ను బట్టి 100 కేజీల నుండి 300 కేజీల వరకు మండలం లెవెల్ స్టాక్ పాయింట్ లో జరుగుతున్న అవకతవకల కారణంగా ఆర్థికంగా నష్టపోవడం జరుగుతూ ఉందని అన్నారు. ఎన్నో ఇబ్బందులు సమస్యలను పరిష్కారం చేయవలసిన సమయంలో వాటన్నిటిని పరిగణంలోకి తీసుకోకుండా కేవలం రేషన్ డీలర్లను బాధ్యులను చేస్తూ రేషన్ డీలర్లను మనోవేదనకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. క్యూ ఆర్ కోడు స్కానింగ్ విధానాన్ని ప్రభుత్వం పరిశీలించి, వెంటనే నిలిపివేయాలని డీలర్ల సంఘం డిమాండ్ చేసింది.

## తెలంగాణలో నడుస్తున్నది పోలీస్ పాలన

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నడుపుతున్నది ప్రజా పాలన కాదు, పోలీసుల నిర్బంధ పాలన అని స్పష్టమవుతోందని బిజెపి విమర్శించింది. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే వివాదాస్పద జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్, మాసాబ్‌ట్యాంక్, రామంతపూర్ నుంచి మొదలుకొని వనపర్తి, పరకాల దాకా విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా రోడ్డెక్కితే.. వారిపై లాఠీఛార్జీలు చేయించడం, అరెస్టులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల న్యాయమైన ఆందోళనకు మద్దతు తెలపడానికి వెళ్తున్న మా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.

# 80 శాతం రాయితీతో విత్తనాలు

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 27:** బండి ఆత్మకూరు గ్రామంలో సాగుచేసిన పత్తి పంటను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ,రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ, స్వల్పకాలిక పంటల సాగుపై దృష్టి సారించాలని వారు సూచించారు. ముఖ్యంగా మినుము, పెసర వంటి పప్పుధాన్య పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ కాలంలో పంటను పూర్తి చేసుకోవడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని అన్నారు.

**80 శాతం రాయితీతో విత్తనాలు :** బండి ఆత్మకూరు మండలానికి ప్రత్యామ్నాయ పంటలైన మినుము విత్తనాలు మండలానికి విబిఎన్8 రకం 50 క్వింటాలు, విబిఎన్ 10 రకం 20 కింటాలు కేటాయించారని ఏవో తెలిపారు. రైతులు 80 శాతం రాయితీతో ప్రత్యామ్నాయ విత్తనాలు సద్వినియోగం చేసుకోవడానికి స్థానిక రైతు సేవ కేంద్రం నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ తెలిపారు. ప్రస్తుతం పి ఎం డి ఎస్ ( పోస్ట్ మాన్ సూన్ డ్రైసోయింగ్ ) కింద అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకుని సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్, రైతు ఈ-కేవైసీ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని తెలిపారు. అలాగే ఫార్మర్ ఐడి పొందని రైతులు త్వరితగతిన విశిష్ట సంఖ్య కొరకు రిజిస్ట్రేషన్ తీసుకోవాలని ఏఓ సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నేలలో తేమ పరిస్థితుల్లో మార్పులు ఉండే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు పంట రక్షణ చర్యలు చేపట్టాలని, వర్షాభావ పరిస్థితులను తట్టుకునే పంటల ఎంపిక, నేలలో తేమ సంరక్షణ, అవసరమైనప్పుడు పంట రక్షణ చర్యలు చేపట్టాలని వారు తెలిపారు. ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ఎంపిక, పంట రక్షణ చర్యలు, బీమా, ఈ-క్రాప్ బుకింగ్ తదితర కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేసుకోవాలని ఏఓ కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ అనూష, వ్యవసాయ విస్తరణ సిబ్బంది అస్రఫ్ పలువురు రైతులు పాల్గొన్నారు.



# వీఆర్వో అబ్దుల్లా అక్రమాలపై జిల్లా కలెక్టర్‌తో విచారణ జరిపించాలి.

**రైతును మోసం చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలి.**

**తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్‌కు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ వినతి పత్రం.**

**న్యాయం జరిగే వరకు పోరాడతామని పార్టీ నాయకుల హెచ్చరిక**



**వెలుగోడు ఆగస్టు 27 (నంది పత్రిక):** నంద్యాల జిల్లా వెలుగోడు మండలంలో రైతు జీవితాలతో ఆడుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్న వీఆర్వో అబ్దుల్లాపై తక్షణమే విచారణ కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మరియు అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నాడు వెలుగోడు తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్‌ను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.

**భూమి పేరిట రూ. 7.30 లక్షలు వసూలు చేసి మోసం:** ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పి. లాజరస్, అఖిల భారత రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడు చాంద్ బాషా మాట్లాడుతూ వీఆర్వో అబ్దుల్లా బాధితులైన రైతు షేక్ హుస్సేన్ మియా, ఆయన భార్య షేక్ మహబూబ్ బిల నుండి పొలం అమ్మకం పేరిట రూ. 7,30,000 (ఏడు లక్షల ముప్పై వేల రూపాయలు) నగదు తీసుకుని ఒప్పందం (అగ్రిమెంట్) రాసి సంతకాలు చేశారని తెలిపారు. అనంతరం 03-06-2024న మహబూబ్ బి పేరు మీద ఆన్‌లైన్‌లో భూమి వివరాలు నమోదు చేసి, తర్వాత కుట్రపూరితంగా ఆ రికార్డులను తొలగించారని ఆరోపించారు. ఆ భూమిని వీఆర్వో తన సొంత బంధువుల పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించి, నమ్మి డబ్బులు ఇచ్చిన పేద రైతును దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు.

**అధికార మదంతో బెదిరింపులు:** బాధితుడు హుస్సేన్ మియా తన న్యాయమైన హక్కు గురించి ప్రశ్నించగా, "నీ బుద్ధి ఉన్న చోట చెప్పుకోపో" అంటూ వీఆర్వో అబ్దుల్లా తీవ్ర నిర్లక్ష్యంతో, బాధ్యతారాహిత్యంగా సమాధానమివ్వడం ఒక ప్రభుత్వ అధికారికి తగిన పద్ధతి కాదని నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వెలుగోడు మండలంలో వీఆర్వో అబ్దుల్లా ఇలా ఎంతమంది పేద రైతులను మోసం చేశారో సమగ్రంగా విచారించాల్సి ఉందన్నారు.

**కలెక్టర్ విచారణకు డిమాండ్:** వెంటనే నంద్యాల జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని వీఆర్వో అబ్దుల్లా అక్రమాలపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని, బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోసపోయిన రైతు కుటుంబానికి పూర్తిగా న్యాయం జరిగే వరకు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అండగా ఉండి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం వెలుగోడు నాయకుడు రవి, బాధితుడు షేక్ హుస్సేన్ మియా దంపతులు మరియు పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# పాములపాడులో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఆగస్టు 27(నంది పత్రిక):-** జిల్లా పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావడం, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడం లక్ష్యంగా చేపట్టిన "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా నేడు శుక్రవారం నందికొట్కూరు నియోజకవర్గం లోని పాములపాడు, కొత్తపల్లె మండలాలకు సంబంధించిన (పీజీఆర్ఎస్) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే జి. జయసూర్య తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, సంబంధిత శాఖల ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను నేరుగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని పాములపాడు, కొత్తపల్లి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు.

# రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు శ్రీ శాంతినికేతన్ విద్యార్థులు ఎంపిక

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 27 ( నంది పత్రిక )**నంద్యాల జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 23వ తేదీన స్థానిక ఎస్పీజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో క్రాంతినగర్‌లోని శ్రీ శాంతినికేతన్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు సి. అరవింద్ మరియు కె. అజయ్ కుమార్ రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సాయి నగర్ రామ్ లక్ష్మణ్ గ్రౌండ్స్‌లో సెప్టెంబర్ 12, 13 మరియు 14వ తేదీల్లో జరగనున్న "8వ సీనియర్ మెన్ & ఉమెన్ స్టేట్ లెవల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ – 2026" పోటీలలో వీరు నంద్యాల జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, వారికి నాణ్యమైన శిక్షణ అందించిన పీఈటీ మాస్టర్లను పాఠశాల చైర్మన్ శ్రీ సుధాకర్ గారు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ విశేష ప్రతిభ కనబరచడం ఎంతో గర్వకారణమని, రాబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా ఉత్తమ ప్రదర్శన కనబరిచి పాఠశాలకు, నంద్యాల జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



# రాయలసీమలో దాహంతో అలమటించే పరిస్థితులు సృష్టించవద్దు

## శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు నీటి తరలింపును తక్షణమే నిలిపివేయాలి.

## రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 27 ( నంది పత్రిక )** ఉమ్మడి కర్నూలు జిల్లా ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌ను గురువారం కలిసి రాయలసీమ జల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, ప్రస్తుత నీటి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తక్షణమే తీసుకెళ్లి, రాయలసీమ నీటి భద్రతకు అత్యవసర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాల నిర్లక్ష్యం, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నీటి నిర్వహణ కారణంగా రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు నీటి తరలింపు ఆపాలి**

ప్రస్తుతం రాయలసీమలో తాగునీరు, ఆరుతడి పంటలకు నీటి భద్రత అత్యంత కీలకంగా ఉన్న నేపథ్యంలో, శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు, అలాగే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా నీటి తరలింపును తక్షణమే నిలిపివేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీశైలం జలాశయంలోని నీటిని రాయలసీమ అవసరాలకు ముందుగా భద్రపరచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాయలసీమకు అవసరమైన సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం, రిజర్వాయర్లలో తగినంత నీటి నిల్వలు లేకపోవడం వల్ల ఈ ప్రాంతం ఇప్పటికే తీవ్రమైన కరువు పరిస్థితులను ఎదుర్కొంటోందని తెలిపారు. శ్రీశైలం నుంచి తెలంగాణలోని విద్యుత్ కేంద్రాల ద్వారా నాగార్జునసాగర్‌కు చేరే నీటిని ఉభయ రాష్ట్రాలు వినియోగించుకుంటాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొనడం, రాయలసీమ అవసరాలను పరిగణనలోకి తీసుకోని ప్రభుత్వ అనాలోచిత నీటి నిర్వహణ విధానాన్ని స్పష్టం చేస్తోందని బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శించారు. అవసరానికి మించి నాగార్జునసాగర్‌కు నీటి తరలింపు ఎల్‌నినో ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా మారిన నేపథ్యంలో, అక్టోబర్ 2026 వరకు ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే నీటిని వినియోగించుకోవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్టోబర్ నెల వరకు ఆంధ్రప్రదేశ్ తన తాగునీటి అవసరాల కోసం సుమారు 47 టీఎంసీల నీటికి కె.ఆర్.ఎం.బి కి ఇండెంట్ ఇచ్చింది. అందులో నాగార్జునసాగర్‌కు తరలించాల్సిన నీటి పరిమాణం సుమారు 14 టీఎంసీలుగా పేర్కొనబడింది. అదేవిధంగా తెలంగాణ వాటా కింద నాగార్జునసాగర్‌కు వెళ్లే నీటిని కలుపుకుంటే, రెండు రాష్ట్రాల అవసరాల మేరకు సుమారు 25 నుంచి 26 టీఎంసీల పరిధిలోనే నీటి తరలింపు ఉండాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అయితే ఇప్పటికే శ్రీశైలం జలాశయం నుంచి సుమారు 53 టీఎంసీల నీరు నాగార్జునసాగర్‌కు తరలించబడినట్లు ఆయన పేర్కొన్నారు. "రాయలసీమకు నీటి నిల్వలను కాపాడాల్సిన సమయంలో, అవసరానికి మించి శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేయడం భవిష్యత్తులో తీవ్ర తాగునీటి సంక్షోభానికి దారితీస్తుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాగునీటి కోసం ప్రజలు అల్లాడే పరిస్థితి ఏర్పడి, చివరకు ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఈ ప్రమాదాన్ని ఇప్పటికైనా గుర్తించాలి" అని బొజ్జా దశరథరామిరెడ్డి హెచ్చరించారు.

**గత ఏడాది నీటిని కాపాడి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది**

గత ఏడాది శ్రీశైలం జలాశయానికి వచ్చిన నీటిని క్యారీ ఓవర్ నిల్వగా భద్రపరిచి ఉంటే, ఈ ఏడాది వచ్చిన నీటితో కలిపి సుమారు 350400 టీఎంసీల నీటిని సమర్థవంతంగా నియంత్రించుకుని, రాయలసీమతో పాటు రాష్ట్ర అవసరాలను మెరుగ్గా తీర్చే అవకాశం ఉండేదని ఆయన అన్నారు. గత ఏడాది నీటి నిర్వహణలో తీసుకున్న నిర్ణయాల ఫలితంగానే ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో తగినంత నీటి భద్రత లేకుండా పోయిందని ఆయన విమర్శించారు.

**రాయలసీమ ప్రయోజనాలపై ప్రభుత్వ వైఖరి మారాలి**

శ్రీశైలం జలాశయంలో నీటిని నిల్వ ఉంచడం, రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని అందించడం, తాగునీటి భద్రతను కాపాడటం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత కావాలని ఆయన అన్నారు. శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా విడుదలయ్యే నీటిని కూడా "సమిష్టిగా వినియోగించుకుంటాం" అనే ప్రభుత్వ వైఖరి, రాయలసీమ ప్రత్యేక అవసరాలు, నీటి హక్కులను విస్మరించే విధంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "రాయలసీమ, వెనుకబడిన జిల్లాల పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలను కాపాడి, రాయలసీమ తాగునీరు మరియు ఆరుతడి పంటలకు నీటి భద్రత కల్పించాలి. రాయలసీమను ఎడారిగా మార్చే నిర్ణయాలకు స్వస్తి పలకాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

**కె.అర్.ఎం.పి.సి.డబ్ల్యు,సి. లో పరిష్కారం కాకపోతే కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి**

కృష్ణా జలాల నిర్వహణ పై పలు సమావేశాల్లో స్పష్టమైన నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఉంటే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ సమస్యను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి, శాశ్వత పరిష్కారం కోసం చొరవ చూపాలని బొజ్జా దశరథరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. కావేరీ జలాల వివాదం ఎంత తీవ్రమైనదో, అంతకంటే క్లిష్టమైన జల సంక్షోభాన్ని రాయలసీమ ఎదుర్కొంటోందని ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. చీఫ్ ఇంజనీర్ ని కలిసిన వారిలో సమితి ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రారెడ్డి, కార్యదర్శి మహేశ్వరరెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలానికి నీటి కష్టాలు

## - పట్టించుకోని అధికారులు



**కొత్తపల్లి – నంది పత్రిక** మండలంలోని దుద్యాల గ్రామంలోనీ ఎస్సీ కాలనీ వాసులకు గత వారం రోజులుగా నీళ్లు రావడంలేదని కాలనీవాసులు రవితేజ, చెన్నయ్య, రాజేష్, రోహిణి, మరియమ్మలు బిందెలతో నిరసన తెలిపారు బీసీ మైనారిటీ ఓసి కాలనీలో 24 గంటల కరెంటు మోటార్స్ ఇచ్చారు ఎస్సీ కాలనీ వాళ్లకేమో మామూలు కరెంట్ మోటార్స్ ఇచ్చారన్నారు అవి పది రోజులకు ఒకసారి ఆగిపోతూ నీళ్లు సరిగా రాక ఇబ్బంది పడుతున్నామని పంచాయతీ సెక్రెటరీ తెలిపిన పట్టించుకోలేదన్నారు దళిత కాలనీలలో ఎప్పుడు మోటార్స్ రిపేర్ అవుతున్నాయని మిగతా కాలనీలో నిరంతరం నీళ్లు వస్తున్నాయన్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి కష్టాలను తీర్చాలని కాలనీవాసులు కోరారు

# రేషన్ షాపుల్లో పాత పద్ధతిని కొనసాగించాలి

## - డీలర్ల సంఘం అధ్యక్షులు మా భాష, శ్రీనివాస్ రెడ్డి



**కొత్తపల్లి – నంది పత్రిక :** రేషన్ షాపుల్లో వచ్చినటువంటి క్యూఆర్ కోడ్ రద్దుచేసి పాత పద్ధతిని కొనసాగించాలని డీలర్ల సంఘం అధ్యక్షులు మా భాష, శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యక్షులు సంజీవ రాయుడు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లి లో ఉన్న తహసిల్దార్ కార్యాలయం ముందు మండలంలోని డీలర్లు ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ అరుణకు రేషన్ షాప్ సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లపై పని భారం తగ్గించి క్యూ ఆర్ కోడ్ రద్దుచేసి పాత పద్ధతిని కొనసాగించాలన్నారు. గోడౌన్లోనే సరియైన తూకాలు వేసి డీలర్లకు బియ్యాన్ని సరఫరా చేయాలన్నారు ప్రతి సంచి పై క్యూఆర్ కోడ్ చేయాలంటే ఇబ్బందికరంగా ఉందన్నారు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న జీతాలను మాకు కూడా అమలు చేయాలి అన్నారు. ప్రస్తుతం డీలర్లకు ఇస్తున్న కమిషన్ పెంచాలి అన్నారు. మండలంలోని డీలర్ల సమస్యలను పరిష్కరించుకునే దిశగా ఐక్యం కావాలి అని పిలుపునిచ్చారు. డీలర్లకు ప్రస్తుతం ఉన్న నిబంధనలతో వచ్చే నెలలో గ్రామాల్లో ఉన్న ప్రజలకు బియ్యం పంపిణీ చేయాలంటే కష్టతరంగా ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నా, రాజు, సుధాకర్, సువర్ణమ్మ, గోవిందు, యాకోబు, చిన్నయ్య, వెంకట రాముడు పలు గ్రామాల్లో ఉన్న డీలర్లు ఉన్నారు.

# ఆత్మీయులకు... అనుబంధాలకు... ఐక్యమత్యానికి చిహ్నామే!!" రక్షాబంధన్ "




## అన్నా="అ"... అమ్మలోని మొదటి పదం "న్న" నాన్నలోని రెండో పదం.

## సోదర ప్రేమకు ప్రతీక.... రక్షా బంధన్

అన్నా చెల్లెళ్లు, అక్క తమ్ముళ్లు ప్రేమానురాగాల ప్రతీకగా రాఖీ పండుగను జరుపుకుంటారు. అయితే పండుగను పకృతి పై మానవుడు సాధించిన విజయాల సందర్భంలో జరుపుకుంటారు. కొన్ని పండుగలను కులాలు, మతాల రంగు పులిమి ఈ పండుగ వారే జరుపుకోవాలి . ఈ పండగ వారే జరుపుకోవాలనే నిబంధన పెట్టడం సరికాదు. శ్రావణ పూర్ణిమనే రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి పేర్లతో పిలుస్తారు. వాస్తవానికి భారతదేశంలో రాఖీ పౌర్ణమి లేదా రక్షా బంధన్ ఎప్పుడు ప్రారంభమైతుందో, ఎలా ప్రారంభమైతుందో తెలిపే నిర్దిష్ట సాక్ష్యాలు లేవు. కానీ, పురాణాలలో మాత్రం దీనిపై వివిధ రకాల కథనాలు ఉన్నాయి. వతసురుడితో యుద్ధం చేస్తున్నప్పుడు ఇంద్రుడు ఓడిపోయే పరిస్థితి వచ్చింది. అప్పుడు తన భర్తకు విజయం చేకూరాలని కోరుతూ ఇంద్రుని భార్య శచీదేవి ఓ పవిత్రమైన దారాన్ని మంత్రించి అతని కుడి చేతి మణికట్టుకి కట్టింది. దీంతో ఆయన రాక్షసులను ఓడించి, విజయం సాధించారని అలా రాఖీ పుట్టిందని చెబుతారు.

**జూపాడుబంగ్లా ఆగస్టు27 (నంది పత్రిక )** మహాభారతంలో ద్రౌపది, శ్రీకృష్ణుల అన్నాచెల్లెళ్ల అనుబంధం గొప్పది. శిశు పారుడిని రక్షించే క్రమంలో తన సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన కృష్ణుని చూపుడు వేలికి గాయమై రక్తం దారగా కారుతుంది. అక్కడే ఉన్న సత్యభామ, రుక్మిణి మొదలైన వారు కంగారు పడి గాయానికి మందు పూయడానికి తలో దిక్కున వెళ్లి వెదుగుతుంటే ద్రౌపతి తన చీర కొంగు చింపి వేలికి కట్టు కట్టింది. దీనికి కృతజ్ఞతగా కృష్ణుడు ఆమెకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చాడు. అందుకే కురు సభలో ద్రౌపది వస్త్రాపహరణానికి దుశ్శాసనుడు ప్రయత్నిస్తే పరంధాముడు అందుకున్నాడు. = రాక్షస రాజు బలి చక్రవర్తి భూ మండలాన్ని ఆక్రమించినప్పుడు దానవుల నుంచి మానవులను రక్షించడానికి శ్రీ మహావిష్ణువు వైకుంఠాన్ని వదిలి వామనుడి రూపంలో భూమి మీదకు వస్తాడట. అప్పుడు లక్ష్మీదేవి ఒక బ్రాహ్మణ యువతి రూపంలో రాక్షస రాజైన బలి చక్రవర్తి దగ్గరికి వెళు తుంది. శ్రావణ పౌర్ణమి రోజు బలి చక్రవర్తి కి పవిత్రధారాన్ని చేతికి కట్టి, తానెవరో చెబుతుంది. తన భర్తని ఎలాగైనా తిరిగి వైకుంఠనికి పంపించాలని కోరుతుందట.. అప్పుడు బలి ఆమె కోసం తన రాజ్యాన్ని వదిలి, మానవులకు విముక్తి కలిగిస్తాడట. అలా విష్ణుమూర్తిని వైకుంఠనికి వెళ్ళమని కోరుతాడట. = రాఖీ' ఎప్పుడు పుట్టింది... ఆ రాష్ట్రాల్లో ఏమంటారు : యముడి సోదరి అయిన యమన ప్రతి శ్రావణం పౌర్ణమ ఆయనకు రాఖీ కట్టేదట. దీనికి బదులుగా యమధర్మరాజు తన సోదరితో ఎవరైతే రాఖీ కట్టించుకుంటారో వారికి అమరత్వం కలుగుతుందని వరం ఇచ్చాడు .రాజపుత్ర వనిత, చిత్తోర్ గాడ్ రాణి అప్పటి ఢిల్లీ చక్రవర్తి హుమాయూన్ కు రాఖీని పంపి గుజరాత్ పాలకుడు బహదూర్ షా దండయాత్రలను నుంచి తమ రాజ్యాన్ని రక్షించా వలసిందిగా కోరారని, ఇప్పటినుంచి రక్షాబంధన్ ప్రారంభమైందని అంటారు. ఈ సంప్రదాయం కొన్ని వేల ఏళ్ల కిందటే ఉన్నట్లు హిందూ పురాణాల్లో పేర్కొన్నారు.




ముఖ్యముగా వేద కాలంలో దీనికి విశేష ప్రచుర్యం లభించింది. వేద కాలంలో ఈ పండుగను కేవలం సోదరీ సోదరుల బంధంగానే కాదు, భార్యాభర్తలకు సంబంధించినది కూడా అని పేర్కొన్నారు. దీనికి సంబంధించి పురాణాల్లో ఓ కథ ఉంది. రాఖీని సోదరి తన సోదరుడుకుడి చేతికి కట్టాలి. రాఖీ లో దారము బంధానికి చిహ్నము అలాగే మంచి చెడలు, వై పల్యాల మంచి సోదరుని ఇది కాపాడుతుంది. ఎరుపు రంగు దారము అగ్నికి ప్రతీక... అంటే ఇది శక్తికి రక్షణకు, భద్రతకు బలం.. =ఏ రాష్ట్రంలో పిలుస్తారు : ఒడిశాలో రాఖీ పండుగను ' గృహమ పూర్ణమ ' అని పిలుస్తారు . ఆ రోజున వారు దైవంలా భావించే ఆవులు,ఎద్దులకు శు భ్రముగా స్నానము చేయించి, అలంకరిస్తారు, 'పిఠా' అని పిలిచే మిఠాయిలు చేసి ఇరుగుపొరుగు వారికి పంచుతారు. మహారాష్ట్ర, గుజరాత్, గోవాలలో ఈరోజును 'నారియల్ పూర్ణిమ ' అంటారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని వరుణడు, సముద్రుణ్ణి పూజిస్తారు.ఇది రైతులకు, కొడుకులున్న తల్లులకు చాలా ముఖ్యమైన పండగ, గుజరాత్ లో కొన్ని ప్రాంతాల్లో 'పవిత్రోపాన' పేరుతో పండుగను నిర్వహిస్తారు. ఈ రోజున శివుని గురించి ప్రజలందరూ పూజ చేస్తారు.

# 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 27 (నంది పత్రిక):** 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహాశీల్దార్ నాగ వీణ తెలిపారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గ్రామ సచివాలయాల లో ఈనెల 29, 30 తేదీల శనివారం, ఆదివారం రెండు రోజులపాటు ఎస్ఐఆర్ స్పెషల్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులు ఓటు హక్కు పొందేందుకు ఫారం 6, అలాగే పేర్లు తదితర మార్పులు చేర్పులకు సంబంధించి ఫారం 8 లో వివరాలు పూర్తి చేసి సచివాలయాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో బిఎల్ఓ లకు అందజేయాలని తెలిపారు. ఎస్ ఐ ఆర్ పూర్తయిన తర్వాత గ్రామాలలో ఎవరైనా మరణించి ఉన్నట్లయితే వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించేందుకు సహకరించేలా మరణించిన వారి కుటుంబ సభ్యులు డెత్ సర్టిఫికెట్ బిఎల్ఓ లకు అందజేయాలని తెలిపారు.

# నేడు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## - తాహసిల్దార్ ఉమారాణి

**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని రెవెన్యూ, మరియు ప్రజల సమస్యల పరిష్కారం కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వన్ మంత్ – ఫోర్ విజిట్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తహసిల్దార్ ఉమారాణి తెలిపారు నేడు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య అధ్యక్షతన , పాములపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయము నందు ఫిర్యాదుల కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం, ప్రజలు




తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవడానికి మరియు వాటి పురోగతిని తెలుసుకోవడానికి ప్రభుత్వం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పి జి ఆర్ ఎస్) పోర్టల్‌ను అందుబాటులో ఉంచిందన్నారు .నియోజకవర్గంలోని కొత్తపల్లి ,పాములపాడు మండలము లను ఎంపిక చేసి అక్కడ వున్న సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు మండలానికి సంబంధించిన ప్రజలు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలన్నారు

# మాజీ సర్పంచ్ కు నివాళులు.

## డోన్ మాజీ ఎంఎల్ఎ కోట్ల సుజాతమ్మ.

**బేతంచెర్ల ఆగస్టు 27 ( నంది పత్రిక ).** బేతంచర్ల మండలం లోని ఎంబాయి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ నాగ విజయప్ప బుధవారం నాడు జరిగిన ప్రమాదంలో మరణించడం పట్ల డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన విజయప్ప మృతదేహానికి వారి నివాసానికి వెళ్లి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, కుటుంబానికి ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



# వై.ఎస్. అవినాష్ ను 'వివేక' కేసులో అక్రమంగా ఇరికించారు...

# కడిగిన ముత్యం లా బైటపడతారు.

**వై.ఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని.. అవినాష్ అత్యున్నత స్థాయికి చేరాలని రెడ్యం ఆకాంక్ష.. వర్గ రాజకీయాలు పక్కన పెట్టి వైఎస్సార్సీపీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయక పోతే చరిత్రహీనులవుతారు.. వై.ఎస్.అవినాష్ రెడ్డి, శెట్టిపల్లె నాగిరెడ్డి జన్మదిన వేడుకల్లో రెడ్య**




**కడప నంది పత్రిక ప్రతినిధి ఆగష్టు 27** ఖాజీపేట: హ్యాట్రిక్ కడప పార్లమెంట్ సభ్యుడు వై. ఎస్. అవినాష్ గెలుపు కోసం బాబాయ్ మాజీమంత్రి వై.ఎస్. వివేక నంద రెడ్డి చనిపోక ముందు రోజే అప్పటి వైయస్సార్ సీపీ శాసన సభ్యుడు శెట్టిపల్లె రఘురామి రెడ్డి వై.ఎస్.అవినాష్ రెడ్డి తో కలసి అవినాష్ గెలుపు కోసం చాపాడు మండలంలో పర్యటించిన బాబాయ్ 'వివేక' ను అవినాష్ హత్య ఎలా చేస్తారని ఆయన సూటిగా ప్రశ్నిస్తూ అలాంటి శాంతి కాముకుడు,ఫ్యాక్షన్ అంటే గిట్టని అవినాష్ ఎదుగుదలను అడ్డుకునేందుకు కుట్ర లో బాగంగా అవినాష్ ను వివేక హత్యకేసులో ఇరికించారని. ఈ కష్టాలు తాత్కాలికమేనని ఆ కేసు నుండి వై.ఎస్. అవినాష్ కడిగిన ముత్యంలా బైట పడతారని వైయస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.ఖాజీపేట మండలం, దుంపలగట్టు వద్ద నేషనల్ హైవే లోని నో మ్యాడ్ స్పార్ట్ హైవే స్టాల్ వద్ద వై.ఎస్ అవినాష్ రెడ్డి,వైయస్సార్ సీపీ మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి,వైఎస్ఆర్సిపి నేత, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, వైయస్సార్ సీపీ మండల నేత శెట్టిపల్లె సిద్ధా రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొనగా గురువారం ఉదయం ఘనంగా జరిగాయి. వైయస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా కార్యదర్శి బత్తల సుబ్బరాయుడు యాదవ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా వైయస్సార్సీపి శ్రేణులనుద్దేశించి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ప్రసంగిస్తూ నిత్యం ప్రజల కోసం పరితపించే వై.ఎస్ అవినాష్ ఎదుగుదలను అడ్డుకోవాలనే ప్రభుత్వ,ప్రతిపక్షాల కుట్ర అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపడమేనని ఆయన తెలిపారు.అవినాష్ పై నిరాధార ఆరోపణలను చేస్తూ దొంగ దెబ్బతీసేందుకు విఫల యత్నం చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. వై.ఎస్ అవినాష్ పై చేసే విమర్శలు నీటి మాటలుగా మిగిలి పోక తప్పదన్నారు. వై.ఎస్.జగన్ ముఖ్యమంత్రిని చేసేందుకు వైయస్సార్ సీపీ శ్రేణులశీతా చావో,రేవో అనే విదంగా పనిచేయలన్నారు. వైఎస్సార్ సీపీ లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం వర్గ రాజకీయాలను ప్రక్కన పెట్టకపోతే చరిత్ర హీనులు కాక తప్పదని రెడ్యం తీవ్రంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత లు,జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గి రెడ్డి కొండారెడ్డి, వైయస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు ముత్తూరు రమణ,ఏటూరు మాజీ సర్పంచ్ ఏనుగు రాజ గోపాల్ రెడ్డి, చెముళ్ళపల్లె మాజీ సర్పంచ్ లు వేమిరెడ్డి గురివిరెడ్డి,ములపాకు బుజ్జి, మిడుతూరు మాజీ సర్పంచ్ తప్పెట చంద్ర, వైయస్సార్ సీపీ మాజీ ఎంపీటీసీ గాలిపోతు మనోహర్, వైఎస్సార్ సిపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామ శివప్రసాద్ నాయుడు, పాలగిరి వెంకట సుబ్బారెడ్డి, దుగ్గి రెడ్డి శ్రీనివాసులరెడ్డి, తిప్పసాని రంగారెడ్డి,వర్దిరెడ్డి వేమారెడ్డి,కోనా సుబ్బారెడ్డి,పుల్లల చెరువు బాస్కరరెడ్డి రెడ్యం నారాయణరెడ్డి,రెడ్యం శ్రీనివాసల రెడ్డి,తుమ్మల క్రిష్ణారెడ్డి,రెడ్యం అభిలాష్ రెడ్డి, తవ్వా సుబ్బారెడ్డి,ఇండ్ల సిద్ధారెడ్డి, చింతకుంట బాష, భూదాడ ఖాజామస్తాన్ (ఉస్మాన్),చింతకుంట అబుభకర్,మునెల్లి సుబ్బ రాయుడు,మునెల్లి వెంకట సుబ్బయ్య,అప్పనపల్లె జయరాజు,రెడ్యం నాగేశ్వర రెడ్డి,గంగిరెడ్డి సదర్శన్ రెడ్డి, గంగిరెడ్డి ఆది కేశవరెడ్డి, తవ్వా వెంకట సుబ్బారెడ్డి,తవ్వా చిన్న సుబ్బారెడ్డి,పోలు నారాయణరెడ్డి,పోలారి సుబ్బారెడ్డి,రెడ్యం పాలకృష్ణారెడ్డి,బత్తల మల్లయ్య యాదవ్,ఖాజామస్తాన్, అంకిరెడ్డి పల్లె సుదర్శన్ రెడ్డి, కమలకూరి కిరణ్,సోమల అభినయ కుమార్ రెడ్డి తో పాటు పెద్ద ఎత్తున వైయస్ఆర్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# వైయస్ నగర్ అభిషిక్తుని ఆశీర్వాద ప్రార్థన మందిరం (చర్చిని) సందర్శించిన గోళ్ళ రాజేష్..






**బరిగల్ గ్రౌండ్ తో పాటు పేద,మధ్యతరగతి ప్రజలకోసం బాడీ ఫ్రీజర్ కొరకు లక్షరూపాయల ఆర్థిక సహకారం అందించారు.. గోళ్ళ రాజేష్ గోళ్ళ రాజేష్ కోసం పెద్ద సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన దైవ సేవకుల(పాస్టర్స్)**

**16 సంవత్సరాల కాలంలో చర్చి కొరకు గోళ్ళ రాజేష్ ఒక్కరే ఆర్థిక సాయం అందించారన్న పాస్టర్స్..**

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 27 ( నంది పత్రిక )** పట్టణంలోని స్థానిక వైయస్ నగర్ నందు ఉన్న అభిషిక్తుని ఆశీర్వాద ప్రార్థన మందిరం (చర్చి) ను సందర్శించాలని వై.యస్.ఆర్ నగర్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, మేడి బుడగ జంగాల రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ బుగ్గ రాముడు ఆహ్వానం మేరకు గోళ్ళ రాజేష్ వైఎస్ఆర్ నగర్ లోని చర్చ్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ బుగ్గ రాముడు తో పాటు పలువురు పాస్టర్లు చర్చికి ఉపయోగకరమైన అవసరాలను దృష్టిలో ఉంచుకొని పేద, మధ్యతరగతి ప్రజల కోసం బాడీ ఫ్రీజర్ను,క్రిస్టియన్ల సమాధులు (బరిగెల్ గ్రౌండ్)చుట్టూ ఫెన్సింగ్ గోడ నిర్మాణం అవసరం ఉన్న విషయాన్ని గోళ్ళ రాజేష్ దృష్టికి తీసుకుని వచ్చారు. వెంటనే స్పందించిన గోళ్ళ రాజేష్ చర్చికి ఉపయోగకరమైన పరిస్థితుల దృష్ట్యా వెంటనే వారికి లక్ష రూపాయల ఆర్థిక సహకారాన్ని చెక్కు రూపంలో తాటికొండ బుగ్గ రాముడుతో పాటు పలువురు పాస్టర్ల సమక్షంలో వారికి అందించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ వైఎస్ఆర్ నగర్ లో నిర్మించిన అభిషిక్తుని ఆశీర్వాద ప్రార్థన మందిరం(చర్చ్) 16 సంవత్సరాల పూర్తి చేసుకున్నదని ఇంతవరకు ఈ చర్చి కొరకు ఎంతో వ్యయప్రయాసలు పడుతూ అందరూ కలిసి చర్చ్ నిర్వహించుకుంటున్నామని కేవలం గోళ్ళ రాజేష్ ఒక్కరు మాత్రమే ఈ చర్చికి ఆర్థిక సహకారం అందించిన మొట్టమొదటి వ్యక్తిఅని జీసస్ గోళ్ళ రాజేష్ కుటుంబాన్ని గోళ్ళ రాజేష్ యొక్క ఆరోగ్యంతో పాటు ఆ ప్రభువు ఆశీర్వాదం వల్ల సకల అష్టైశ్వర్యాలు కలగాలని గోళ్ళ రాజేష్ భవిష్యత్తులో ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు,ప్రజలకు మరింత మెరుగైన సంక్షేమ పథకాలు అందించాలని గోళ్ళ రాజేష్ గురించి పెద్ద సంఖ్యలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్ధన చేశారు. ఈ కార్యక్రమంలో తాటికొండ బుగ్గ రాముడు మాట్లాడుతూ ఎన్నో చర్చిలు నిర్వహించడంలో పాస్టర్లు ఎంతోమంది పేదరికంతో చాలా ఇబ్బంది పడుతూ చర్చిల నిర్వహణ కొనసాగిస్తున్నారని గోళ్ళ రాజేష్ నంద్యాల నియోజకవర్గంలో చేస్తున్న పలు సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్న సేవా సహాయ సహకారాలు కులమతాలకు అతీతంగా చేస్తున్న ఆర్థిక సహకారాలు అన్నిటిని గుర్తు చేస్తూ గోళ్ళ రాజేష్ ని అభినందించారు. గోళ్ళ రాజేష్ ని అభిషిక్తుని ఆశీర్వాద ప్రార్థన మందిరం(చర్చి)కి రావాలని చర్చి యొక్క అవసరాలను గుర్తించాలని అడిగిన వెంటనే పెద్ద మనసుతో గోళ్ళ రాజేష్ ఇక్కడికి వచ్చి చర్చికి అవసరం ఉన్న విషయం తెలుసుకొని వెంటనే లక్షరూపాయల ఆర్థిక సహకారం అందించినందుకు గోళ్ళ రాజేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు,అభినందనలు తెలిపారు. ఇలాంటి చర్చీలకు ఎంత సేవా,సహాయ, సహకారాలు అందించిన ప్రభు ఆశీర్వాదం వల్ల వారికి మరింత ప్రభు యొక్క ఆశీర్వచనాలు కలుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ మాట్లాడుతూ తన జీవితంలో జరిగిన ఒక సంఘటన తనకు ఒకసారి ఒక ప్రమాదవశాత్తు తన చేతికి అయిన గాయం వల్ల మండుతున్న మంట వల్ల ఎంతో బాధ పడ్డ విషయాన్ని ఒక పాస్టర్ గమనించి వెంటనే ఒక వాటర్ బాటిల్ తీసుకొని ప్రార్థన చేసి తనకిచ్చి ఆ నీటిని తాగమన్నారు తాగిన తర్వాత పడుతున్న గాయం వల్ల కలుగుతున్న మంట క్రమంగా తగ్గిపోయిందని తన విషయంలో జరిగిన సంఘటన అద్భుతం అని తాను ఆశ్చర్య పోయిన విషయం గుర్తుచేసుకున్నారు. కులమతాలు తనకు లేవని అందరూ భగవంతుని బిడ్డలమే అని భవిష్యత్తులో ఇంకా ఎలాంటి సేవ,సహాయ,సహకారాలు చేయాలన్న దానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు తాటికొండ బుగ్గ రాముడు,డి పాల్ జోసఫ్ గారు బాలరాజు గారు కాలేబు, జయరాజు,ఇశ్రాయిల్, లాజర్,ప్రసాద్,ఆశీర్వాదం, సురేష్, విల్సన్,డేనియల్,జేమ్స్,ప్రకాష్,సామెల్ పాల్గొన్నారు.







# పంచాయితీ ఎన్నికలకు " ఎల్నినో" సెగలు




**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 27:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఎల్నినో సెగలు తగలబోతున్నాయా? అవును.. నిజమేనని పరిశీలకులు అంచనాలు వేసుకుంటున్నారు. గతంలో మునుపెన్నడూ లేని విధంగా, ఈ ఏడాది ఎల్లినో ప్రభావం కారణంగా ఖరీఫ్ సీజన్లో అన్నదాతలకు సాగునీటికి గండం ఏర్పడింది. ఈ కారణంగా ఆశించని రీతిలో వర్షాలు కురియక పోవడంతో అన్నదాతల భవితవ్యం అగమ్య గోచరంగా తయారైంది. ఎగువ రాష్ట్రాలలో వర్షాలు కురియడంతో శ్రీశైలం డ్యాం లో తాగునీటి అవసరాల కోసం నీటిని నిలువ ఉంచారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాబోవు రోజుల్లో సా గునీటి సంగతి అటు పక్కన పెడితే, తాగునీటికి కూడా ప్రజలు తల్లడిల్లే ప్రమాదం ఉంటుందని గుర్తించిన కూటమి ప్రభుత్వం, ముందు జాగ్రత్త చర్యగా శ్రీశైలం డ్యామ్ లో నీళ్లను నిలువ ఉంచడం జరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఖరీఫ్ సీజన్లో వరి సాగుకు స్వస్తి చెప్పి ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలని గత రెండు నెలల కాలం నుండి ప్రభుత్వం రైతులకు సూచనలు చేస్తూ వస్తుంది. రైతులు ఈ విషయాన్ని పక్కన పెట్టి వరి సాగుకు పూనుకొని, ప్రస్తుతం సాగునీటి కోసం తహతహ లాడుతున్నారు. దీన్ని అవకాశంగా తీసుకొని వైసిపి నాయకులు రైతుల నుండి సానుభూతి పొందడంతో పాటు రాజకీయ లబ్దిని పొందాలని ప్రయత్నాలు చేసుకుంటున్నారు. నంద్యాల జిల్లాలో ఇప్పటికే పలు ప్రాంతాలలో రిజర్వాయర్లను సందర్శిస్తున్నారు. గ్రామాలలో పర్యటించి సా గునీటి కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను అవస్థలను గుర్తిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం దిగిరాకపోతే సెప్టెంబర్ 1న వందలాది ట్రాక్టర్లతో వెలుగోడు రిజర్వాయర్ ను ముట్టడించి తీరుతామని శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఇటీవల హెచ్చరికలు జారీ చేసారు. ఇలాంటి నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని సంకేతాలు వస్తూ ఉండటంతో వైసిపి దీని అవకాశంగా తీసుకొని రైతులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలను చేసుకుంటున్నారని సమాచారం. మరోవైపు వైసీపీ పార్టీ అధినాయకుడు జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో నాయకులకు ప్రత్యేకంగా అల్టిమేటం జారీ చేశారు. మాజీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఏ ఒక్క పంచాయతీలో ఏకగ్రీవం జరిగిందన్న సమాచారం తెలిస్తే, ఆ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు రాబోవు ఎన్నికల్లో టికెట్ కోల్పోతారని తాజాగా హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల విషయంలో ఏ ఒక్క పోలీసు అధికారి టిడిపి నాయకులకు మద్దతు తెలిపితే, అటువంటి వారిని డిజిటల్ బుక్ లో నమోదు చేయాలని కూడా హెచ్చరికలు జారీ చేశారు. జగన్ హెచ్చరికలతో వైసిపి నాయకుల గుండెల్లోను రైళ్లు పరిగెడుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పంచాయతీ ఎన్నికలు జరిగిన సందర్భంలో చాలా ప్రాంతాలలో ఏకగ్రీవాలు గా నిర్వహించాలని పోలీస్ అధికారులపై వైసీపీ నాయకులు ఒత్తిడి తెచ్చారన్నది బహిరంగ రహస్యమే. కూటమి ప్రభుత్వం కూడా ఇదే తరహాలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని వారు సైతం ఇప్పటినుండి వ్యూహరచనలు చేసుకుంటున్నారని చర్చలు జరుగుతూ ఉన్నాయి. ఎల్నినో ప్రభావాన్ని అవకాశం గా తీసుకొని తమ రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు ప్రయత్నాలు చేసుకుంటుండగా, అధికారాన్ని అడ్డుపెట్టుకొని అదే తరహాలో తమ పట్టును పెంచుకోవాలని టిడిపి నేతలు వ్యూహరచనలు చేసుకుంటున్నారని వినికిడి.



# ఖాజీపేటలో 42 కేజీల భారీ కేక్ తో అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**కడప నంది పత్రిక ప్రతినిధి ఆగష్టు 27** కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి 42వ జన్మదిన వేడుకలు ఖాజీపేటలో ఘనంగా జరిగాయి. ఖాజీపేట బస్టాండ్ కూడలిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి వినోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 42 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవినాష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డెం వెంకటసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ దుగ్గి రెడ్డి మురళీమోహన్ రెడ్డి, వైస్సార్సీపీ జిల్లా జాయింట్ సెక్రెటరీ పీవీ రాఘవరెడ్డి,వైస్సార్సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ కార్యదర్శి పాలకొల్లు లక్ష్మీనారాయణ రెడ్డి,ఖాజీపేట మండలానికి చెందిన జిల్లా, మండల నాయకులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జివో 97ను రద్దు చేయాల్సిందే హరీష్ రావు డిమాండ్

పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 97 జీవోను రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

## సమస్యాత్మక గ్రామమైన పెసరవాయిలో ఫ్యాక్షన్ పోలీస్ పికెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.సునీల్ షోరాణ్, ఐపీస్




**నంది పత్రిక గడివేముల** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి జిల్లా ఎస్పీ నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీస్ పాణ్యం సర్కిల్ పరిధిలోని గడివేముల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక గ్రామమైన పెసరవాయి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఫ్యాక్షన్ పోలీస్ పికెట్‌ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.గ్రామంలో ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితి, ప్రజల జీవన విధానం, స్థానికంగా ఉన్న సమస్యలు, ప్రజల మధ్య సంబంధాలు తదితర అంశాలపై సంబంధిత పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.అనంతరం ఫ్యాక్షన్ పోలీస్ పికెట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి విధుల నిర్వహణపై ఆరా తీశారు. పికెట్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో జరిగే ప్రతి పరిణామాన్ని నిశితంగా గమనించాలని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద కదలికలు, సమస్యలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు మీ దృష్టికి వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించడంతో పాటు ప్రజలకు భద్రతా భావన కల్పించే విధంగా పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా, పటిష్టమైన పోలీస్ బందోబస్తు, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించడం ద్వారా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు.శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, అందుకు ప్రతి ఒక్క పోలీస్ అధికారులు సిబ్బంది బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ.సునీల్ షోరాణ్, ఐపీస్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు పాణ్యం ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



## యూనిరేషన్ బియ్యం సంచులపై క్యూఆర్ కోడ్ తొలగించాలి.



**శిరివెళ్ల : (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల ప్రభుత్వ చౌక దుకాణం డీలర్లు యూనియన్ అధ్యక్షులు ఎదురుల నాగ సురేష్ ఆధ్వర్యంలో గురువారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహసిల్దార్ ఐ విజయ శ్రీ కి అందజేశారు.రేషన్ బియ్యం సంచులపై ఉన్న క్యూఆర్ కోడ్ లను తొలగించాలంటూ రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు సభ్యులు ఆధ్వర్యంలో న్యాయబద్ధమైన డిమాండ్లు తో కూడిన వినతి పత్రాన్ని అందజేసి రేషన్ బియ్యం సంచుల గురించి వివరించారు. డీలర్లకు పంపిణీ చేస్తున్న సమయంలో లేని క్యూ ఆర్ కోడ్ విధానం తమ వద్ద ఎందుకని ప్రశ్నించారు. డీలర్లకు ఒక్క రూపాయి కమీషన్ తో రూమ్ బాడుగ, కరెంటు బిల్లు, హమాలీ కూలీల రేట్లు అధిక భారమయ్యాయన్నారు. డీలర్లకు కేవలం 2వేలు నుంచి 3వేల రూపాయలు మాత్రమే మిగులుతుందన్నారు. దీంతో కుటుంబాన్ని పోషించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని కమీషన్ ను రెండు రూపాయల నుంచి మూడు రూపాయలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రభుత్వ చౌక దుకాణం డీలర్లు పాల్గొన్నారు.

## బుధవారపేటలో పోలీసుల విస్తృత తనిఖీలు.

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు త్రీ టౌన్ ఎస్సై సమీర్ ఆధ్వర్యంలో బుధవారపేట ప్రాంతంలో గురువారం సాయంత్రం విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ బహిరంగంగా మద్యం సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. అలాగే స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించి శాంతిభద్రతలు, నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



## బ్రాహ్మణ కొట్కూరు లో మహిళల భద్రత చట్టాలపై అవగాహన.



**నందికొట్కూరు ఆగస్టు 27( నంది పత్రిక)** మహిళల భద్రత రక్షణ చట్టాలపై గురువారం నందికొట్కూరు మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామం నందు డిఎస్పి రామాంజీనాయక్, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు శక్తి టీ ం మరియు ఎస్ఐ మణికంఠ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మణికంఠ మహిళల ను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళల భద్రత కొరకు శక్తి యాప్ రూపొందించడం జరిగిందని మొబైల్ ఉన్న ప్రతి మహిళ శక్తియాఫ్ వాట్సాప్ నంబర్ 7993485111 డౌన్లోడ్ చేసుకొని భద్రత కొరకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అత్యవసర సమయాలలో పోలీస్ సేవలు కొరకు 112,100 అలాగే 181,1098,1930 డయల్ నెంబర్స్ ప్రాముఖ్యత వాటి వల్ల ప్రయోజనాలపై మహిళలకు ఆయన అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ముఖ్యంగా యువకులపై తప్పనిసరి అని, ఎందుకంటే మత్తు పదార్థాలు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. మహిళలు మరియు అమ్మాయిల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే అలాంటి సమాచారాన్ని చేరవేస్తే చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తప్పవని వారికి భరోసా కల్పించారు. మహిళల రక్షణ చట్టాలపై ప్రతి మహిళలు అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగము చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం ఏఎస్ఐ ఖాదర్ బాషా, కానిస్టేబుల్ రసూల్, మరియు పోలీస్ సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విఆర్ఓ కుటుంబాన్ని ఆదుకోవాలి : పిక్కిలి వెంకటేశ్వర్లు.



**నందికొట్కూరు ఆగస్టు 27( నంది పత్రిక )** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విఆర్ఓ హరిచంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, అతని కుమారునికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రైతు కార్మిక సంఘం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పగిడాల మండలం, పాతకోట గ్రామంలో వీఆర్వో హరిచంద్ర కుటుంబాన్ని సిపిఐ ఎమ్ ఎల్ లిబరేషన్ రైతు కార్మిక సంఘం నాయకులు జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు తన పార్టీ నాయకులతో కలిసి కుటుంబాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు వీఆర్వో హరిచంద్ర కు ఒక కుమార్తె కుమారుడు ఉన్నారని, కుమార్తె మనిసిక ఆనారోగ్యంతో బాధపడుతుందని, కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో మరణించిన వీఆర్వో కుటుంబానికి ప్రభుత్వ నిబంధన ప్రకారం రావాల్సిన పిఎఫ్ ఈఎస్ఐ తదితర ప్రయోజనాలను ప్రభుత్వం కల్పించడంతోపాటు కారుణ్య నియామకం ద్వారా కుమారునికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు గుంపుల త్యాగరాజు, సామన్న, రిటైర్డ్ విఆర్ఓ శేషగిరిరావు, కుటుంబ సభ్యులు తలారి పద్మావతి, టి దివ్య, తలారి హరీష్, టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

**పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి**

**జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్**



**నంద్యాల బ్యూరో, ఆగస్టు, 27(నంది పత్రిక):** జిల్లాలో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి, రెవెన్యూ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు 22-ఏ జాబితా సవరణలు, రీ సర్వే, డిజిటల్ పట్టాదారు పాస్ పుస్తకాల (పీపీబి) పంపిణీ, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, మ్యుటేషన్, తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఆర్డీవోలు, తాసిల్దారులు, సర్వే అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ఆర్డీవోలు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీసర్వే, ఫోర్టింగ్‌కు సంబంధించిన పెండింగ్ పనులు, 5వ విడత రీసర్వేలో గ్రౌండ్ ట్రూథింగ్ (జీటీ ), డీల్ ఆర్ పనుల పురోగతి తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. రీసర్వే, సంబంధించిన పెండింగ్ పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. మండలాల వారీగా పెండింగ్ పనులను గుర్తించి, వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 5వ విడత రీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూథింగ్ (జీటీ) పనులను ఆగస్టు 31 నాటికి పూర్తి స్థాయిలో ముగించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని సూచించారు. నిలిచిపోయిన డీల్ఆర్ పనులన్నింటినీ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి మండలంలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిఫెక్టెడ్ గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు తహశీల్దార్లు, మండల సర్వేయర్లకు వర్చువల్ విధానంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రీసర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, సాంకేతిక అంశాలపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.రీసర్వే ప్రక్రియలో అధికారులు, సిబ్బందికి ఏవైనా సమస్యలు లేదా సందేహాలు ఉంటే వాటిని పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత ఉన్నతాధికారులను వ్యక్తిగతంగా కలిసి స్పష్టత తీసుకోవాలని అన్నారు. మండల స్థాయి నుంచే రీసర్వే ప్రక్రియను మరింత సులభతరం (స్ట్రీమ్ లైన్ ) చేసి, నివేదికలు, ఫైళ్లను ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత డైరెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్‌కు త్వరితగతిన పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు..

## అంగరంగ వైభవంగా శేగు వారి వివాహ మహోత్సవం.

**శిరివెళ్ల :(నంది పత్రిక)** (నంద్యాల సాయి దత్త ఏసి ఫంక్షన్ హాల్):- శిరివెళ్ల మండల కేంద్రంలోని ప్రముఖ వ్యాపార వేత్త హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ మరియు పెట్రోల్ బంక్ డీలర్ శేగు కృష్ణమూర్తి శేగులక్ష్మీదేవి దంపతుల కుమారుడు సత్యనారాయణ సాయి సువర్ణ దంపతుల వివాహం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. నంద్యాల పట్టణంలోని రైతు నగరం శ్రీ గురుదత్త గ్రాండ్ ఏసీ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకకు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు ఆత్మీయులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో సాయి దత్త ఏసీ ఫంక్షన్ హాల్ కిక్కిరిసిపోయింది.వేద పండితుల ఆశీర్వచనాలు మంగళ వాయిద్యాలు మూడు ముళ్ళు ఏడడుగులు పంచభూతాల సాక్షిగా జరిగిన వివాహ వేడుకలో నూతన వధూవరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ప్రత్యేకమైన రకరకాల వంటకాలతో అతిథులకు శేగు కృష్ణమూర్తి గారు వివాహ భోజనం కల్పించారు. ఈ సందర్భంగా భగవంతుడి చరణాల సాక్షిగా కంటి చూపులతో కలిసిపోయి. మాటల ముచ్చట్లతో మురిసిపోయి. మూడు ముళ్ళతో ముడిపడిపోయి. ఏడడుగులతో ఏకమై. మనసులు మమేకమై. రెండు హృదయాలు ఒక్కటవ్వాలని నూతన జంటను ఆశీర్వదించారు.నూతన వధూవరులు పిల్లాపాపలతో నిండు నూరేళ్లు ఆదర్శ దంపతులుగా జీవించాలని ఆకాంక్షించారు.



# ముస్లింల పైన గిరిజనుల పైన జరుగుతున్న దాడులు అరికట్టాలి

**ఇన్సాఫ్,, ఏపీజీస్ సంఘం**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఇన్సాఫ్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగినది ఈ ధర్నా కార్యక్రమానికి ఇన్సాఫ్ నగర కార్యదర్శి అన్వర్ భాష అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్, జాఫర్ హుస్సేన్ ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై ఎల్ రామాంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ పరిపాలన ఏర్పడి 13 సంవత్సరాలు కావస్తుంది నేటికీ దేశంలో ఏదో ఒక మూలన ముస్లింల పైన గిరిజనుల పైన దాడులు హత్యలు, హత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని గిరిజనులను ముస్లింలను అన్ని రకాలుగా ఆదుకుంటామని ఎన్నికల ముందర చంద్రబాబు నాయుడు నరేంద్ర మోడీ చెప్పారే కానీ ముస్లింలకు ఐదు శాతం రిజర్వేషన్ గిరిజనులకు బ్యాక్ లాగ్ ఉద్యోగాలు ఇవ్వడంలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఎన్నికల ముందర అనేక వాగ్దానాలు చేసిన వాటిని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని ధరల నియంత్రణ గాని ఉద్యోగాలు కల్పించడంలో కానీ ఎక్కడ ముస్లిమ్ లకు గిరిజనులకు పరిగణంలోకి తీసుకోవడం లేదని 500 జనాభా ఉన్న ప్రతి గిరిజన తండాను గ్రామపంచాయతీలుగాగుర్తించాలని జిల్లా కేంద్రాలలో గిరిజన స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఉద్యోగాలు కల్పించే దాంట్లో గిరిజనులకు ముస్లింలకు ప్రత్యేక చొరవ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని గిరిజనులకు ముస్లింలకు ఎస్టీ మరియు మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా ఎలాంటి కూచికత లేకుండా రుణాలు ఇచ్చి వారి కుటుంబాలు ఆర్థికంగా మెరుగుపడే దానికోసం ప్రత్యేక చొరవ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని మైనార్టీలకు హక్కుగా ఉన్న వాక్ బోర్డు చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని పట్టణ ప్రాంతాలలో ముస్లింలకు గిరిజనులకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని గిరిజన ప్రాంతాలలో అన్ని రకాలుగా అభివృద్ధి చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది కనుక పరిపాలో మార్పు రావాలి మోడీ పాలన పోవాలి అన్న నినాదంతో సెప్టెంబర్ 1న ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరిగే ఆందోళనల సభకు పెద్ద సంఖ్యలో ముస్లింలు గిరిజనులు పాల్గొని మోడీ పరిపాలనకు వ్యతిరేకంగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు ఈ ధర్నా కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా నాయకులు ఎం.నబి రసూల్ నగర అధ్యక్షులు దొడ్డిపాడు భాష రజియా కరీమున్ని ఆశాపేగం రసూల్ బషీర్, గౌస్,భాష గిరిజన సంఘం నగర నాయకులు దుర్గమ్మ లోక్ నాయక్ నాగరాజు తదితరులు ఈ ధర్నా కార్యక్రమంలో ముస్లింలు గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# పరిశుభ్రతలో కొత్త ప్రమాణాలకు శ్రీకారం

**తొలిదశలో చేరుకున్న 42 చెత్త సేకరణ ఈ-ఆటోలు**

**కేసీ కెనాల్‌లో యుద్ధప్రాతిపదికన గుర్రపుడెక్క తొలగింపు**

**చెత్త రహిత నగరమే లక్ష్యంగా ముందడుగులు**

**వీధుల పరిశుభ్రతపై విస్తృత కార్యాచరణ**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో పరిశుభ్రతను మరింత మెరుగుపరచడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావడానికి నగరపాలక సంస్థ అనేక చర్యలు చేపడుతోందని కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. గురువారం ఆయన కిడ్స్ వరల్డ్ కూడలి, బుధవారపేట కూడలి, వినాయక ఘాట్, ఓమెగా ఆసుపత్రి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అలాగే విజయపురి కాలనీ, శివప్రియ నగర్ ప్రాంతాల్లో పిజిఆర్ఎస్ ఫిర్యాదులను పరిశీలించారు. పరిమళ నగర్ అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. 5 రహదారుల కూడలి, రైల్వే స్టేషన్ సమీపంలో లేబర్ అడ్డా ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని పరిశీలించారు. వెంకటరమణ కాలనీలోని విశాల్ మార్ట్ వెనుక ఈ–ఆటోల పార్కింగ్, చార్జింగ్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను పరిశీలించారు. అనంతరం కేసీ కెనాల్‌లో యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న గుర్రపుడెక్క మొక్కల తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా త్వరలో 91 చెత్త సేకరణ ఈ–ఆటోలు అందుబాటులోకి రానున్నాయని, వీటి ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాల్లో చెత్త సేకరణ వ్యవస్థను మరింత పటిష్టం చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే తొలి దశలో 42 ఈ–ఆటోలు నగరానికి చేరుకున్నాయని, మిగిలిన వాహనాలు కూడా త్వరలో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ–ఆటోల కోసం విశాల్ మార్ట్ వెనుక పార్కింగ్, చార్జింగ్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.నగరంలో చెత్త సేకరణ, తరలింపు, పారిశుద్ధ్య నిర్వహణలో ఆధునిక విధానాలను అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కమిషనర్ తెలిపారు. వీధులు, ప్రధాన రహదారులు, కాలనీలు, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు చెప్పారు. నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు.



నగరంలో దోమల నివారణకు నగరపాలక సంస్థ యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోందని కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి వాటిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు అధికారులు, కార్మికులు ఎంతగానో శ్రమిస్తున్నారని కొనియాడారు.కొన్ని రోజుల క్రితం డ్రోన్ ద్వారా బీటీఐ బయో లార్విసైడ్ పిచికారీ చేసినప్పటికీ, దోమల ఉత్పత్తిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు స్వయంగా కెనాల్‌లోకి దిగి పిచికారీ చేశారని తెలిపారు. తేమ, అపరిశుభ్ర వాతావరణం మధ్య పనిచేస్తూ కార్మికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని చెప్పారు. కాళ్ల వరకు తేమలో పనిచేయడం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లు, దురద, ఎర్రటి దద్దుర్లు, మంట వంటి సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ, దోమల నియంత్రణ కోసం వారు విధులు నిర్వహించారని తెలిపారు. అంతేకాకుండా కెనాల్‌లో పనిచేసే సమయంలో పాములు, తేళ్లు, జర్రులు, ఎలుకల ముప్పుతో పాటు విపరీతమైన దోమల మధ్య కార్మికులు శ్రమించారని కమిషనర్ పేర్కొన్నారు. వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కేసీ కెనాల్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను పూర్తిస్థాయిలో తొలగించేందుకు హిటాచీలు, ట్రాక్టర్లు, టిప్పర్లను వినియోగిస్తూ యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఒక్కోరోజు సుమారు 70 నుంచి 100 ట్రిప్పుల వరకు గుర్రపుడెక్కను తొలగించి తరలిస్తున్నామని చెప్పారు. కెనాల్ పరిశుభ్రతతో పాటు దోమల ఉత్పత్తి కేంద్రాలను నిర్మూలించడమే లక్ష్యంగా పనులను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. దోమల నియంత్రణ అనేది కేవలం నగరపాలక సంస్థ బాధ్యత మాత్రమే కాదని, నగర ప్రజలందరి సమిష్టి బాధ్యత అని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే కర్నూలు నగరాన్ని దోమల రహితంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దగలమని ఆయన పేర్కొన్నారు. నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, చెత్తను వేరు చేసి అందించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, నరేష్, ఏఈలు వైష్ణవి సీవీఆర్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఖాసీం వలి, రాజశేఖర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, మునిస్వామి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దివాకర్ నాయుడు, ట్యాబ్ ఇన్‌స్పెక్టర్ రవి, వెహికల్ ఇంచార్జీ కురుబ మధు, తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు ఇంటి కన్నం దొంగలు అరెస్ట్

**15 తుల్లా బంగారు ఆభరణాలు, 18 తులాల వెండి ఆభరణాలు స్వాదీనం**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆదివారం రోజున మధ్యాహ్నం కర్నూల్ నగరం, హోసన్న మందిర్ సమీపాన గల శ్రీనివాస నగర్లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సమీపంలో నివాసం ఉన్నటువంటి సెకండ్ బటాలియన్ పనిచేసే హెడ్ కాన్స్టేబుల్ మహేష్ వారి ఇంట్లోను, అతని పక్క ఇంట్లోనే నివాసముండే రిటైర్డ్ ఆర్ యస్ ఐ సుబ్బయ్య ఇంట్లో లేని సమయంలో మధ్యాహ్నం సుమారు 12 నుంచి 1 మధ్యలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి దూరి బీరువాలో దాచుకున్న సుమారు 28 తులాల బంగారు ఆభరణాలు 20 తులాల వెండి ఆభరణాలు మరియు రెండు లక్షల నగదు ఎత్తుకెళ్లారని ఇచ్చిన ఫిర్యాదులు మేరకు రెండు కేసులు నమోదు చేసుకొని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పార్టీ ఐపీఎస్ ఆదేశాల మేరకు, సీఐ విక్రమ్ సింహ ఆధ్వర్యంలో లో ధర్యాప్తులో భాగంగా యస్ ఐ శ్రీనివాసులు, పీసీ లు సుబ్బారాయుడు, మురళి మరియు శ్రీనివాసులు ఒక ప్రత్యేక బృందంగా ఏర్పడి అందుబాటులోని సిసిటీవీ ఫుటేజ్లు మరియు లభించిన ఇతర ఇన్ఫర్మేషన్ మేరకు దొంగతనానికి పాల్పడిన వ్యక్తులు హైదరాబాద్ నగరం కి చెందినటువంటి సర్ఫరాజ్, ఖుర్రం అలీ మరియు షనవాజ్ లుగా గుర్తించి వారి యొక్క లేటెస్ట్ ఫోన్ డేటా సేకరించుకొని నిఘా పెట్టి ఉంచి ఈ రోజున వారి కదిలికలు కర్నూలు ఔటర్ రింగ్ రోడ్లో ఉన్నట్లుగా గమనించి సిబ్బందితో వారిని అదుపులో తీసుకొని విచారించగా సర్ఫరాజ్, షనవాజ్ మరియు కుర్రం అలీ ముగ్గురు కూడా ఆదివారం రోజున వారు దొంగతనానికి కర్నూల్ కి వచ్చినట్టు, శివారు ప్రాంతాలలో తిరిగి శివార్లలోని ఇళ్ల తాళాల పగులగొట్టి, బీరువా లను పగులగొట్టి రెండు ఇళ్లలో సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లి నట్టు వాటిని అమ్ముకొనే క్రమంలో బెంగుళూరు వెళ్తుండగా పట్టుకొని అరెస్ట్ చేసి, 15 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి నగలు, నేరానికి ఉపయోగించిన క్వాలిస్ వాహనం సీజ్ చెయ్యడం జరిగింది.వీరిపై సిద్దిపేట, అడ్డాకల్,రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ లలో 10 కి పైగా దొంగతనం కేసులు కలవు.



## కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన క్రిటికల్ బ్లాక్ ప్రారంభోత్సవం



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి న్యూ డయాగ్నొస్టిక్ బ్లాక్‌లోని 3వ మరియు 4వ అంతస్తుల్లో నూతనంగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్ ను సోమవారం అనగా ఆగస్టు 31వ తేదీన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డా చేతుల మీదుగా వర్చువల్ విధానంలో, ఎల్ ఈ డి స్క్రీన్ ద్వారా ప్రారంభించనున్నారు.ఈ నేపథ్యంలో క్రిటికల్ బ్లాక్‌లో జరుగుతున్న ప్రారంభోత్సవ ఏర్పాట్లు, ఇతర పనులను ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. నూతన క్రిటికల్ బ్లాక్ అందుబాటులోకి రావడంతో అత్యవసర మరియు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ గారితో పాటు జూ=మీా డా పి.పద్మజ గారు, డిప్యూటీ జూ=మీా డా వి.పద్మజ గారు =మీా డా వెంకట రమణ గారు, మరియు ఇతర ఆసుపత్రి అధికారులు పాల్గొన్నారు.

## నేపాల్ వరదల్లో మాజీ ఎమ్మెల్యే భార్య గల్లంతు

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే శుభ్రాన్షు రాయ్ భార్య శర్మిష్ట భౌమిక్ రాయ్ నేపాల్ వరదల్లో గల్లంతయ్యారు. శర్మిష్ట కోల్‌కతాకు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా కైలాస మానససరోవర యాత్ర కోసం ఆగస్టు 21వ తేదీన నేపాల్ వెళ్లారు. ఆమె ఆగస్టు 25వ తేదీ మంగళవారం రాత్రి 11:30 గంటల సమయంలో శుభ్రాన్షు రాయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తాను టిబెట్ సరిహద్దుకు సమీపంలోని 'కైరోంగ్' ప్రాంతంలో ఉన్నట్లు భర్తతో చెప్పారు. బుధవారం ఉదయం నేపాల్–టిబెట్ సరిహద్దుల్లో భారీ ఎత్తున మెరుపు వరదలు వచ్చాయి. అప్పటినుంచి శర్మిష్టతో కమ్యూనికేషన్ పూర్తిగా తెగిపోయింది. తన భార్య పేరు మిస్సింగ్ లిస్ట్‌లో ఉందని శుభ్రాన్షు రాయ్ ధ్రువీకరించారు. కేవలం శర్మిష్ట మాత్రమే కాకుండా, ఆమెతో పాటు యాత్రకు వెళ్లిన కోల్‌కతాకు చెందిన 32 మంది యాత్రికుల బృందం ఆచూకీ లేకుండా పోయింది.

## రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి రేషన్ డీలర్ల సంఘం



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 27 నంది పత్రిక:** ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆళ్లగడ్డ మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ మజీద్ డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాలకు పంపిణీ చేసే ప్రతి బస్తాలను స్కానింగ్ చేసే విధానాన్ని తొలగించాలని, రేషన్ డీలర్లకు ప్రస్తుతం ఇస్తున్న కమిషన్ ను పెంచాలని కోరుతూ మండల తహసిల్దార్ జ్యోతి రత్న కుమారికి డీలర్లు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ రేషన్ దుకాణంలో బియ్యం దిగుమతి చేసేటప్పుడు ప్రతి బస్తాకు స్కానింగ్ మరల పంపిణీ చేసేటప్పుడు మరొకసారి ప్రతి బస్తాలు స్కానింగ్ చేయడం వల్ల చాలా ఇబ్బందికరమైన పని ఒత్తిడి ఉంటుందన్నారు. అందువల్ల ఆ పనిని మేము చేయడం సాధ్యం కాదన్నారు. కాబట్టి ఈ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే విరమించి పని భారం తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం మా కమిషన్ 300 పెంచుతూ గోదాము దగ్గర మాకు ప్రతి ఒక్క బస్తాను స్కాన్ చేసి దుకాణాలకు పంపిస్తే మేము పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.ఈ కార్యక్రమంలో నాయుడు, అబ్దుల్లా, దస్తగిరి రెడ్డి, మద్దిలేటి, మీరాన్ సాహెబ్, నాగయ్య, రాజేంద్రనాథ్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, బీసీ రాముడు, జోకా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు

## యశోదాలో గవర్నర్‌కు సిఎం పరామర్శ

అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను సిఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలసి వెళ్లిన సిఎం గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. ఈ మేరకు గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీసారు.

## ఆయిల్ పామ్ పంటపై రైతులకు శిక్షణ

**- ఉద్యాన శాఖ అధికారిణి కె చందన**



**కొత్తపల్లి – నంది పత్రిక :** ఆయిల్ పామ్ పంట రైతులకు కొత్తది కావడం వలన రైతులు అన్ని రకాలుగా ఈ పంట పైన శిక్షణ కలిగి ఉండడం ఎంతో అవసరం అని ఉద్యాన శాఖ అధికారి చందన ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం, యాగంటిపల్లి శాస్త్రవేత్త ఆది నారాయణ అన్నారు గురువారం మండలంలోని, దుద్యాల గ్రామంలో ఆయిల్ పామ్ పంట మీద రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు అనంతరం మాట్లాడుతూ మొక్క నాటేటప్పుడు కార్బోఫ్యూరాన్ గుళికలు, వేప పిండి, ఎస్ ఎస్ పి తప్పకుండా వేసుకోవాలన్నారు మొక్కలు నాటుకున్న మూడు నెలల తర్వాత మాత్రమే ఎరువులని తగిన మోతాదులో యూరియా 850 గ్రాములు, ఎస్ఎస్పి 1200 గ్రాములు, పొటాష్ 650 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 125 గ్రాములు, బోరాన్ 25 గ్రాములు చొప్పున ఒక్కొక్క మొక్కకి రెండు దఫాలుగా వేసుకోవాలి. కొమ్ము పురుగులు ఆశించకుండా ఉండేందుకు పొలంలో ఎరువు కుప్పలు శుభ్రంగా ఉంచుకోవాలి. మొవ్వు కుళ్ళు రాకుండా, ట్రిచోడెరం 1కేజీ, సూడోమోనాస్ 1కేజీ, మెటారైజియం 1కేజీ మరియు వేప చెక్క 10కేజీ మిశ్రమాన్ని 100 కేజీల ఎరువు తో కలిపి ఎకరా పొలంలో చల్లాలన్నారు అలాగే ఉద్యాన శాఖ తరపున ఆయిల్ పామ్ మొక్కలకి హెక్టార్ కి 10,500 రూపాయలు సబ్సిడీ అందిస్తున్నామన్నారు రైతులకు సబ్సిడీలో స్ప్రేయర్లు, ప్లాస్టిక్ ప్లేట్లు కలవని తెలిపారు. పతాంజలి కంపెనీ మేనేజర్ రమణారెడ్డి మాట్లాడుతూ రైతుల దగ్గర నుంచి తామే ఆయిల్ ఫామ్ గెలలను కొంటామని, కనీస మద్దతు ధర తప్పక చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి ఏ ఏ ఉష, పతాంజలి స్టాఫ్ కృష్ణ కిషోర్, ప్రసాద్, రవి, మధు, నవభారత్ స్టాఫ్ సుబ్బయ్య మరియు రైతులు పాల్గొన్నారు.

## రైతుల పక్షపాతి చంద్రబాబు రైతుల పాలిటి ద్రోహి జగన్ కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



**కర్నూలు సిటీ నందిపత్రిక** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనునిత్యం రైతులకోసం పాటుపడుతూ రైతులు పచ్చగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందనీ తలంచే రైతుల పక్షపాతి అని, వై.యస్. జగన్మోహన్రెడ్డి మాత్రం రైతులపాలిటి ఒక శని, రైతు ద్రోహి అని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ రోజు వారు జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయం నుండి పత్రికల వారితో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.యస్. జగన్మోహన్రెడ్డి 5 సంవత్సరాలు పనిచేసిన సందర్భంలో రైతాంగాన్ని నిట్టనిలువునా ముంచారనీ, అందువల్లనే 2024లో రాష్ట్రంలోని ప్రజలు, రైతులు జగన్ న్ను ఇంటికి సాగనంపి, తమకోసం పనిచేసే నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమికి పట్టం కట్టారనీ, తమపై ఎంతో నమ్మకంతో గెలిపించిన రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వచ్చి రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రదాని మోది సహకారంతో పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తిచేసి రైతులకు నీరందించేందుకు కృషిచేస్తున్నారనీ, త్వరలో వెలిగొండ ప్రాజక్టు ద్వారా నీరందించడం జరుగుతుందనీ తెలియజేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు , నారా లోకేష్, పవన్ కళ్యాణ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తుంటే జగన్ మాత్రం విమర్శలే పనిగా పెట్టుకున్నారన్నారు. జగన్ ప్రభుత్వం హయాంలో ఒక్క ప్రాజెక్టును కూడా వారు ప్రారంభించింది లేదనీ, అలాంటి వ్యక్తి వెలిగొండ తామే పూర్తిచేశామంటూ తప్పుడు ప్రచారానికి పూనుకున్నారు. 2019 నాటికి చంద్రబాబునాయుడు 73% పనులు పూర్తి చేసినటువంటి పోలవరం ప్రాజెక్టు పనులలో జగన్ తనహయాంలో కనీసం 1% పని కూడా చేపట్టలేదనీ ఇలాంటి వ్యక్తి అసత్య ప్రచారాన్ని ప్రజలు సడించుకుంటున్నారన్నారు. జగన్ హయాంలో హంద్రీనీవాకు నీటిని లిఫ్ట్ చేసేందుకు ఉపయోగించిన మోటార్లకు సంభందించి కనీసం విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేదనీ, కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని క్లియర్చేయడమేకాక హంద్రీనీవా కెనాల్ విస్తరణ పనులను చేపట్టి చివరి ఆయకట్టు వరకు నీరు అందించడం జరుగుతుందనీ, జగన్ సొంత నియోజకవర్గం పులివెందులకు కూడా నీటినిచ్చిన ఘణత చంద్రబాబు గారిదనీ వివరించారు. జగన్ హయాంలో కేవలం డిపార్టుమెంట్ల వారీగా ప్రజల సొమ్ము దోచేయడం తప్ప వారు చేసింది శూన్యమనీ, చంద్రబాబునాయుడు నదుల అనుసందానంతో రాష్ట్రంలోని రైతులకు కావలసినుటవంటి సాగునీటిని, ప్రజల అవసరాలకు త్రాగునీటిని అందించిన అపరబగీరదుడయ్యారనీ, జగన్ చౌకబారు విమర్శలు మానాలనీ సూచించారు. రాష్ట్ర ప్రజలకు కూడా ఒకటే విజ్ఞప్తిచేస్తున్నా. జగన్ తిరిగి తన మోసపూరితమైన మాటలతో మరోసారి ప్రజల మధ్యకు రాబోతున్నారనీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్మోహన్రెడ్డి వై.సి.పి. పార్టీ వారికి తగిన బుద్ధిచెప్పాలనీ, రాష్ట్రం కోసం అహర్నిషలు పాటుపడుతున్న చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి పార్టీల వారిని గెలిపించి రాష్ట్రసర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలనీ విజ్ఞపిచేస్తున్నాము.

## ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తను మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** స్థానిక రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ టి. మల్లికార్జున రావు ని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

## దుకాణాల వేలంతో రూ.6.70 కోట్ల ఆదాయం

**నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ**

**పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వేలంపాటల నిర్వహణ**

**పోటీ లేని దుకాణాల వేలం వాయిదా**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని 8 మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో 81 షాపుల వేలంపాట ద్వారా నగరపాలక సంస్థకు రూ.6.70 కోట్ల ఆదాయం సమకూరినట్లు అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ తెలిపారు. గురువారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో మూడోరోజు వేలంపాట నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లలోని దుకాణాలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మూడు రోజులు వేలం నిర్వహించామని తెలిపారు. ఈ నెల 22, 25, 27 తేదీల్లో నిర్వహించిన వేలంపాటల్లో ఇప్పటివరకు మొత్తం 81 దుకాణాలు వేలం వేయగా, గుడ్‌విల్, సెక్యూరిటీ డిపాజిట్ తదితరాల రూపంలో మొత్తం రూ.6.70 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. మూడోరోజు నిర్వహించిన వేలంపాటలో సి.క్యాంప్ సెంటర్‌లోని 36 దుకాణాలకు వేలంపాట నిర్వహించగా, వాటి ద్వారా రూ.5.16 కోట్లకుపైగా ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గత మూడు రోజులుగా జరిగిన వేలంపాటల్లో వ్యాపారులు, ఔత్సాహికులు పోటీతత్వంతో పాల్గొనడం ద్వారా నగరపాలక సంస్థకు గణనీయమైన ఆదాయం లభించిందన్నారు. వేలంపాటలో తగినంత పోటీ లేని దుకాణాలకు సంబంధించి వేలాన్ని వాయిదా వేసినట్లు అదనపు కమిషనర్ తెలిపారు. భవిష్యత్‌లోనూ నిబంధనల మేరకు వేలంపాటలను పారదర్శకంగా నిర్వహించి, నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్వోలు వాజిద్, క్రిస్టోఫర్, మంజూర్ బాష, పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# పోరుమామిళ్ల ఆర్అండ్‌బీ రోడ్డు పనులపై అధికారుల సమీక్ష



**పోరుమామిళ్ల ఆగస్ట్ 27 (నంది పత్రిక ):** వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలో కొనసాగుతున్న ఆర్అండ్‌బీ రోడ్డు పనుల పురోగతిపై అధికారులు సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోరుమామిళ్ల తహసీల్దార్ కార్యాలయంలో బద్వేల్ ఆర్డీవో ఏ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, సీఐ హేమసుందర్ రావు, ఆర్అండ్‌బీ ఏఈ ప్రసన్నతో పాటు రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు. రోడ్డు అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించిన అధికారులు, వచ్చే వారం కూడా మరోసారి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

# పోరుమామిళ్లలో జాతీయ వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



**పోరుమామిళ్ల, ఆగస్టు 27 (నంది పత్రిక ):** పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ వైద్య ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యుగంధర్ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల, టేకూరుపేట, కలసపాడు, నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు.ఈ సమావేశంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై చర్చించారు. ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా డీఐఓ డాక్టర్ జె. ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఆరీఫ్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్, జిల్లా మలేరియా అధికారి, బద్వేల్ తాలూకా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్, డీపీఎం నారాయణ, కలసపాడు వైద్యాధికారి డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజ, టేకూరుపేట వైద్యాధికారి డాక్టర్ మేరీ ఎలీషా, డాక్టర్ జయరాం, నరసాపురం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ పుష్ప, సీహెచ్ఓలు, డిప్యూటీ హెచ్ఈఓ సాధు వెంకటేశ్వర్లు, పోరుమామిళ్ల సబ్‌యూనిట్ ఆఫీసర్ టి. నరసింహారెడ్డి, కడప సబ్‌యూనిట్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు రాఘవ, వెంకటేశ్వర్లు, ఎం.వి.వి. ప్రసాద్, ఎస్‌యూఓ కడప అర్బన్ తదితరులు పాల్గొన్నారు అలాగే అన్ని పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎంపీహెచ్ఏ (ఎం), ఆశా కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడంపై సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు.

## భీమవరం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులు క్లినిక్లు డయాగ్నొస్టిక్ ల్యాబ్లను ఆకస్మిక పనికిల నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం రవిబాబు



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 27 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. ఎం. రవిబాబు గురువారం నాడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా భీమవరం పరిధిలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్లు మరియు డయాగ్నస్టిక్ ల్యాబ్‌లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పలు ఆసుపత్రులు మరియు ల్యాబ్‌లు నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి సరైన రిజిస్ట్రేషన్లు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఇటువంటి అనధికార వైద్య కేంద్రాల నిర్వాహకులపై డా. రవిబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డా. ఎం. రవిబాబు మాట్లాడుతూ... నిబంధనల ప్రకారం ప్రభుత్వ అనుమతులు మరియు రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్న అన్ని ఆసుపత్రులు, ల్యాబ్‌ల నిర్వాహకులు తక్షణమే సంబంధిత శాఖను సంప్రదించి వారం రోజులలోపు (7 రోజులు) విధిగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలి.గడువు ముగిసినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా అక్రమంగా కొనసాగుతున్న ఆసుపత్రులు మరియు ల్యాబ్‌లపై ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా సీజ్ చేయడంతో పాటు, చట్టపరంగా అత్యంత తీవ్రమైన క్రిమినల్ చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అర్హత లేని వ్యక్తులు వైద్యం అందించడం, లేదా అనధికారికంగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా అనధికారిక వైద్య సేవలు లేదా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే ప్రజలు లేదా బాధ్యత గల పౌరులు వైద్యాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు.



## సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకురాలు కృష్ణమ్మను కలిసిన ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజ్



**పోరుమామిళ్ల, ఆగస్ట్ 27 (నంది పత్రిక ):** తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజ్ పోరుమామిళ్ల పర్యటన సందర్భంగా సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకురాలు శ్రీమతి పి. కృష్ణమ్మ కుటుంబాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణమ్మ నివాసానికి వెళ్లిన దిల్ రాజ్ కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా కృష్ణమ్మ ఆరోగ్య పరిస్థితిని దిల్ రాజ్ అడిగి తెలుసుకున్నారు. ఆమె ఆరోగ్యం గురించి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొద్దిసేపు కుటుంబ సభ్యులతో స్నేహపూర్వకంగా ముచ్చటించి, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.దిల్ రాజ్ వెంట మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి, డాక్టర్ దేశాయ్ మర్కా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శారదమ్మ, వంశీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు. వీరంతా కృష్ణమ్మ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. దిల్ రాజ్ తమ ఇంటికి రావడంతో కృష్ణమ్మ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సినీ రంగంలో ప్రముఖ వ్యక్తిగా ఉన్న దిల్ రాజ్ పోరుమామిళ్లకు రావడంతో స్థానికంగా కూడా ఆసక్తి నెలకొంది. ఆయన పర్యటన సందర్భంగా పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు, అభిమానులు కలుసుకుని ఆత్మీయంగా మాట్లాడారు. కృష్ణమ్మ ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకోవడం, కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడటంతో ఈ మర్యాదపూర్వక భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

# నీట్ పీజీ పరీక్ష ఏర్పాట్ల పై డిఆర్ఓ అధికారుల తోసమీక్ష



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 27 నంది పత్రిక** ఆగస్టు 30 తేదీన జరగనున్న నీట్ పీజీ పరీక్షకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పగడ్బందీగా ఏర్పాటు చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి పి గ్లోరియా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లో ఛాంబర్ యందు నీట్ పీజీ పరీక్ష సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 30వ తేదీన జరిగే నీట్ పరీక్ష జిల్లాలో రెండు కేంద్రాలు ,భీమవరం డి ఎన్ ఆర్ కాలేజ్, మరియు చినమేరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల భీమవరం యందు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12.30, గంటల వరకు జరుగుతున్నాయని అన్నారు. ఈ పరీక్షకు 280 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. పరీక్ష సెంటర్ వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని, పోలీస్ బందోబస్తు సహాయం తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి గ్లోరియా ఆదేశించారు. ఈ సమావేశంలో డి.ఎస్.పి రఘువీరా విష్ణు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఏ .రాంబాబు, డీఈఓ ఆఫీస్ ఏడి ఇ.నారాయణ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి. శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ డి ఈ పి రాజ్ కుమార్ బాబు, తాహసిల్దార్ రావి రాంబాబు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎండి జహీర్, హెల్త్ డిపార్ట్మెంట్ పి. సుకుమార్, పాల్గొన్నారు.



## రేపు శుక్రవారం మొగల్తూరులో జరగవలసిన ప్రత్యేక పిజిఆర్ఎస్ రద్దు

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 27. నంది పత్రిక** ఆగస్టు 28 శుక్రవారం నరసాపురం నియోజకవర్గం మొగల్తూరులో జరగవలసిన ప్రత్యేక పి.జి ఆర్ .ఎస్ కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నేడుఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1 తేదీ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయు డు పర్యటన నరసాపురం నియోజకవర్గంలో ఉన్న నేపథ్యంలో పి.జి.ఆర్.ఎస్ రద్దు చేస్తున్నట్లు తెలిపారు.ప్రజలు ఈ విషయాన్ని గమనించవలసింది గా కోరారు.

## ఎస్.ఎన్. కాలనీలో నూతన పార్క్ పనులను పరిశీలించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**రాయచోటి బ్యూరో చీఫ్ ఆగస్టు 27 నంది పత్రిక** రాయచోటి పట్టణంలోని ఎస్.ఎన్. కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్క్ నిర్మాణ పనులను రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పరిశీలించారు.పార్క్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు చిన్నారులు, యువత, వృద్ధులకు ఉపయోగపడేలా పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు.రాయచోటి పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరుస్తూ ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు





## పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలి

### హెడ్మాస్టర్లు, సిఆర్పిలు సమన్వయంతో పనిచేయాలి

### ఎంఈఓ శోభా వివేకావతి



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 27 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలంలో స్టేట్ లెవెల్ అచీవ్మెంట్ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు హెడ్మాస్టర్లు, సీఆర్పీలు సమన్వయంతో పని చేయాలని మండల విద్యాశాఖ అధికారి శోభ వివేకవతి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నూర్జహాన్ అధ్యక్షతన హెడ్మాస్టర్లకు,సిఆర్ పి లకు (స్లాష్) స్టేట్ లెవెల్ అచీవ్మెంట్ ఎగ్జామ్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ స్కూల్లో విద్యార్థులకు మనం చేసే బోధన ఏ మేరకు అర్థమవుతుందని అంశంపై ఎన్నుకోబడిన ఐదు స్కూళ్లలో నుండి 5, 7, 9 విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఈ పరీక్షకు విద్యార్థులు సక్రమంగా హాజరయ్యేలా మరియు పరీక్షలలో ఉత్తీర్ణుల అయ్యేలా వారికి మంచి తర్ఫీదును అందించేలా చేయాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు సిఆర్పి లు సమన్వయంతో చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నూర్జహాన్, ఎంఈఓ 2 గంగాధర్, హెడ్మాస్టర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.


## రెండేళ్ల నమ్మకం సంక్షేమం, అభివృద్ధి' ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయితున్న సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు కూలంకషంగా వివరించారు. ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటూ, 'రెండేళ్ల నమ్మకం సంక్షేమం, అభివృద్ధి' సమాచార కరపత్రాలను ప్రతి ఒక్కరికీ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ:"ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోంది. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. రాబోయే రోజుల్లో కూడా కోడుమూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తాం" అని స్పష్టం చేశారు.ముడుములగుర్తి గ్రామంలో 25 లక్షలతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు మండల టీడీపీ కన్వీనర్ రామకృష్ణా రెడ్డి , స్థానిక టీడీపీ నాయకులు ,తెలుగుదేశం పార్టీ బూత్, యూనిట్ మరియు క్లస్టర్ ఇన్చార్జీలు, జనసేన-భాజపా శ్రేణులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్లపై ఆవులను వదిలి వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### అనిమల్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షులు ఈపనగండ్ల శ్రీనివాస్ యాదవ్



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 27 నంది పత్రిక** పట్టణ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై ఆవులను వదిలి వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అనిమల్ బోర్డు నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు, సమాజ సేవకులు డాక్టర్ ఈపనగండ్ల శ్రీనివాస యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో వందలాది ఆవులు లేగ దూడలు రోడ్లపైనే ప్లాస్టిక్ పేపర్లు తింటూ చలికి, వానకు, ఎండకు తడుస్తూ ఉంటున్నాయన్నారు. గోసంరక్షకుల దారులు వాటిపై లోన్లు తీసుకొని వాటి సంరక్షణ చర్యలు తీసుకోకుండా రోడ్డుపై వదిలివేస్తున్నారన్నారు. అటువంటి వారిపై సంబంధిత అధికారులు ఎఫ్ఐఆర్ బుక్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే నిరాహార దీక్ష చేస్తానని ఆయన హెచ్చరించారు.

## పోరుమామిళ్లలో సినీ సందడి.. దిల్‌రాజుకు ఘన స్వాగతం



**పోరుమామిళ్ల, ఆగస్టు 27 (నంది పత్రిక ):** కడప జిల్లా పోరుమామిళ్లలో శ్రీ పట్టాభి రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. పవిత్రమైన ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు సతీసమేతంగా, యువ హీరో వంశీకృష్ణ హాజరుకావడంతో భక్తులతో పాటు సినీ అభిమానుల్లోనూ ప్రత్యేక సందడి నెలకొంది.దిల్‌రాజు, వంశీకృష్ణ ఆలయానికి చేరుకున్న సందర్భంగా వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ఆలయం వరకు ఆలయ వ్యవస్థాపకులు శ్రీరామ్ ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో ప్రజలు, భక్తులు తరలివచ్చి సినీ ప్రముఖులను చూసేం దుకు ఆసక్తి చూపారు. అనంతరం వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, కార్యక్రమాలను వీక్షించారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడాయి. ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు సినీ ప్రముఖుల రాకతో కార్యక్రమానికి మరింత ప్రత్యేకత సంతరించుకుంది.ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. సుమారు 20 ఏళ్ల క్రితం కడపలో తిరిగిన రోజులు, అప్పటి జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయని తెలిపారు. ఇలాంటి పవిత్రమైన కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. దిల్‌రాజు, యువ హీరో వంశీకృష్ణ రాకతో పోరుమామిళ్లలో సినీ అభిమానులు, స్థానిక ప్రజల్లో ఉత్సాహం కనిపించింది. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సినీ సందడితో శ్రీ పట్టాభి రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ వాసుల పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష



**గల్లంతైన వారి ఆచూకీని కనుగొనేలా కేంద్రంతో నిరంతర సంప్రదింపులు జరపాలన్న ముఖ్యమంత్రి**

**బాధితులను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చేలా చూడాలని అధికారులకు సీఎం ఆదేశం**

అమరావతి, బ్యూరో చీఫ్ ఆగస్టు 27 నంది పత్రిక: నేపాల్‌లో సంభవించిన భారీ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసుల పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు చేపట్టిన సహాయక చర్యలను అధికారులు సీఎంకు వివరించారు. మానస సరోవర్ యాత్ర వెళ్లిన ఏపీకి చెందిన పలువురు యాత్రీకులు నేపాల్ వరదల్లో చిక్కుకున్నారని అధికారులు సీఎంకు తెలిపారు. వీరికి సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి చెందిన 41 మంది నేపాల్ వరదల్లో చిక్కుకున్నట్టు ఇప్పటివరకు గుర్తించామని, వీరిలో 34 మంది సురక్షితంగా ఉన్నారని, మరో ఏడుగురి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరించాల్సి ఉండటంతో ప్రస్తుతం కొందరు అక్కడే చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. కర్నూలు-ఆదోని ప్రాంతానికి చెందిన నలుగురు టిబెట్‌లో సురక్షితంగా ఉన్నారని వారితో తాము మాట్లాడమని వివరించారు. అలాగే తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండూలో సురక్షితంగా ఉన్నారని వారిని కూడా ఆర్టీజీఎస్ నుంచి సంప్రదించినట్టు అధికారులు చెప్పారు. ఇక చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరు వంటి ప్రాంతాలకు చెందిన ఏడుగురు గల్లంతు అయ్యారని తెలిపారు. ఆచూకీ లభ్యం కాని ఏడుగురిలో ముగ్గురు ఈషా ఫౌండేషన్ తరపున మానస సరోవర్ యాత్రకు వెళ్లి చిక్కుకున్నారని తెలిపారు. ప్రస్తుతం వారి ఫోన్లు అందుబాటులో లేవని అధికారులు సీఎంకు వివరించారు. బాధిత కుటుంబాలకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని చెప్పారు. ఢిల్లీలోని ఏపీ భవన్ లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం సమాచారాన్ని సేకరిస్తున్నామని కేంద్ర ప్రభుత్వంతో పాటు... ఖాట్మంటూ, చైనాల్లోని ఎంబసీలతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నామని అధికారులు తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న ప్రతి ఒక్కరి క్షేమం కోసం అన్ని మార్గాల్లో సమన్వయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆచూకీ తెలియని వారి వివరాలను నిరంతరం ట్రాక్ చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరణతో పాటు అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సురక్షిత తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కష్టాల్లో ఉన్న ఏపీ వాసులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ తాజా వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

## కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రోడ్లకు మోక్షం.. ఎంపీ పుట్టా మహేష్ కుమార్.



ఏలూరు బ్యూరో చీఫ్ , ఆగస్టు 27 నంది పత్రిక: గత ప్రభుత్వ హయంలో ఐదేళ్లు గుంతల రోడ్లతో రాష్ట్రంలో ప్రజలు, వాహనదారులు నరకం చూడగా, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక రోడ్లను పునర్నిర్మించుకోగలిగామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చెప్పారు. గురువారం చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెం పట్టణం, పరిసర ప్రాంతాల్లో పలు రోడ్లకు ఎంపీ ప్రారంభోత్సవం చేశారు. ఉదయం 10 గంటల సమయంలో జంగారెడ్డిగూడెం చేరుకున్న ఎంపీకి, జంగారెడ్డిగూడెం పట్టణ టిడిపి అధ్యక్షుడు బంర్డెడ్డి కిషోర్, మండల అధ్యక్షుడు మాధవరావు, జడ్పిటిసి సభ్యుడు పొల్నాటి బాబ్జీ, పార్టీ నేతలు దాసరి శేషు, దాకరపు కృష్ణ, ముస్తఫా, ఇతర నేతలు ఘన స్వాగతం పలికారు. ముందుగా జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆధునిక సౌకర్యాలతో పునర్నిర్మించిన సూర్యతేజ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాసపురంలో 50 లక్షల జడ్పీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, 30 లక్షల సీసీ డ్రైన్ కు ఎంపీ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం 90 లక్షల ఏఐబి నిధులతో నిర్మించిన అక్కంపేటశ్రీనివాసపురం బీటీ రోడ్డుకు, 3 కోట్ల వ్యయంతో నిధులతో జంగారెడ్డిగూడెం నుంచి ములగలంపల్లి వరకు (వయా శ్రీనివాసపురంమైనర్‌గూడెం) నిర్మించిన బీటీ రోడ్డుకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రారంభోత్సవం చేశారు. ఎంపీతో పాటు కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ అత్యవసర పని నిమిత్తం కార్యక్రమాల మధ్యలోనే అమరావతి బయలుదేరి వెళ్లగా, పార్టీ నేతలతో కలిసి ఎంపీ మిగిలిన కార్యక్రమాలను పూర్తి చేశారు.



# నగరపాలక సంస్థ ఎన్నికలు ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలి.





**ఎన్నికల ప్రక్రియను మనస్సు పెట్టి పనిచేస్తే మంచిఫలితాలు వస్తాయి. పొరపాట్లు, అలసత్వం వహిస్తే సస్పెండు అవుతారని, తీవ్రత బట్టి ఉద్యోగం కోల్పోయే పరిస్థితి ఉందని ప్రతి ఒక్కరూ గ్రహించాలి.**

**ఏలూరు అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ )ప్రగతిపై అధికార్లు,సూపర్వైజర్లు, బియల్వో లతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్ష ...**

ఏలూరు, బ్యూరో చీఫ్ ఆగస్టు 27: నంది పత్రిక స్థానిక నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఏలూరు అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ ప్రగతిపై నగర పాలకసంస్థ అధికారులు, సూపర్వైజర్లు, బియల్వో లతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ మ్యాపింగు, అనామలీస్, కరేక్షన్లు, ప్రగతిపై అర్బన్ లో 247 పోలింగు బూత్ లు వారీగా 247 బియల్వో లతో సమీక్షించారు. ఏలూరు అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్) ప్రగతి చాలా పూర్ గా ఉందని జిల్లా కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. ఈరోజు హాజరుకాని సూపర్వైజర్లు, బిఎల్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చెయ్యాలని, ఇదే పరిస్థితి పునరావతమైతే సస్పెండు చేస్తానని జిల్లా కలెక్టరు హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఎన్నికలు ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలని, ఎన్నికల ప్రక్రియను మనస్సు పెట్టి పనిచేస్తే మంచిఫలితాలు వస్తాయని అన్నారు. పొరపాట్లు, అలసత్వం వహిస్తే సస్పెండు అవుతారని, తీవ్రత బట్టి ఉద్యోగం కోల్పోయే పరిస్థితి ఉందని ప్రతి ఒక్కరూ గ్రహించాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని మరియు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని, అనర్హులుగా గుర్తించిన వారి వివరాలను పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించుకుని తాగు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ప్రతి ఒక్కరూ అత్యంత బాధ్యతతో, అప్రమత్తంగా, మనస్సు పెట్టి పనిచెయ్యాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్, మాపింగు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, బిఎల్వోలకు సీనియరు సూపర్వైజర్లతో మరొకసారి శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఎస్ఐఆర్, ప్రోగ్రామ్, అనామలీస్ లోపాలు, వ్యత్యాసాలు, మరియు మాపింగు ప్రక్రియపై సూపర్వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని అన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం ఎస్ఐఆర్ పనులను వేగవంతం చెయ్యాలని అన్నారు. అనామలీస్ గుర్తింపు, ఓటర్ల జాబితాలోని వ్యత్యాసాలు మరియు లోపాలు, మాపింగు పనులు, పోలింగు కేంద్రాలు మరియు ఓటర్ల మాపింగు ప్రక్రియను పారదర్శకంగా పూర్తిచెయ్యాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ ఎన్నికలు నేపథ్యంలో కమీషనర్లు తమ పరిధిలో అనుభవజ్ఞులైన, సమర్థులైన అధికారులను గుర్తించి ఎన్నికల విధులకు నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాల్లో శాఖలు మధ్య సమన్వయం ఉండాలని, రాష్ట్ర ఎన్నికలు సంఘానికి నిర్ణీత గడువులో అవసరమైన వివరాలతో అనుసరణ నివేదిక సమర్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమీషనరు ఏ.భానుప్రతాప్, అడిషనల్ కమీషనరు డి.శ్రీనివాస రావు, అసిస్టెంటు సిటీ ప్లానరు బాబూరావు, తహశీల్దారు యస్.వి. రవీంద్రనాథ్, సూపర్వైజర్లు, బిఎల్వోలు, నగరపాలక సంస్థ సిబ్బంది, తదితరులు పాపాల్గొన్నా.





## వెలుగొండ ప్రాజెక్టు ప్రదాత చంద్రబాబు నాయుడు కు ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు - మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

గుంటూరు బ్యూరో చీఫ్ ఆగస్టు 27 నంది పత్రిక వెలుగొండ ప్రాజెక్టుకు ఈనెల 31వ తేదీ నీటి విడుదల సందర్భంగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి కృతజ్ఞతగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఇవాళ మార్కాపురం పట్టణంలోని దోర్నాల బస్టాండ్ సెంటర్ నుండి నాయుడు బజార్, అమ్మవారి శాల, గడియార స్తంభం సెంటర్, దోర్నాల బస్టాండ్ వరకు మహిలు మరియు విద్యార్థుల ఆధ్వర్యంలో కోలాటం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాజెక్టు ప్రారంభించి జల హారతి ఇవ్వనున్నారని ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొని ఉందని ప్రజలు లేనంత సంతోషంగా ఉన్నారని అందుకే మొన్న మార్కాపురం పట్టణంలో భారీ ట్రాక్టర్ల ర్యాలీ, నిన్న భారీ బైక్ ర్యాలీ, ఈరోజు మహిళల ఆధ్వర్యంలో వినూత్న కోలాటం కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెలుగొండ ప్రాజెక్టు నీటి విడుదలకు ఎటువంటి ఆటంకాలు రాకుండా రేపు మహిళల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి ఆలయం నుండి కాలేజీ రోడ్లో ఉన్న గంగమ్మ తల్లి ఆలయం వరకు మహిళలు కలశాలతో వెళ్లి గంగమ్మకు అభిషేకం చేయనున్నారని దీనికి మహిళలందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం అందర్నీ అలరించింది.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితుడికి 10 రోజుల జైలు శిక్ష

**రూ.12,500 జరిమానా విధించిన నాయుడుపేట కోర్టు**

తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 27 నంది పత్రిక తిరుపతి జిల్లా నాయుడుపేట హైవేపై మద్యం సేవించి కంటైనర్ లారీని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్‌కు నాయుడుపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు 10 రోజుల జైలు శిక్షతో పాటు రూ.12,500 జరిమానా విధించినట్లు నాయుడుపేట సిఐ వెంకటేశ్వరరావు మీడియా సమావేశం తెలియజేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ అర్ధరాత్రి సుమారు 1:30 గంటల సమయంలో చెన్నై నుంచి నెల్లూరు వైపు జాతీయ రహదారిపై కంటైనర్ లారీ నంబర్ ౧చీ-88-జీ-2370ను డ్రైవర్ తియగరాజన్ అతివేగంగా, నిర్లక్ష్యంగా, ప్రమాదకరంగా నడుపుతున్నట్లు డయల్-112 ద్వారా పోలీసులకు సమాచారం అందుకున్న వెంటనే నాయుడుపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం. శివశంకర్ రావు, బీట్ సిబ్బందితో కలిసి మల్లాం జంక్షన్ సమీపానికి చేరుకుని లారీని అడ్డుకుని తనిఖీ చేశారు. బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించగా డ్రైవర్ మద్యం సేవించినట్లు నమోదైంది. దీంతో నిందితుడిపై నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఎంవీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు పూర్తి అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన నాయుడుపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి పి. మీనాక్షి సుందరి నిందితుడికి 10 రోజుల జైలు శిక్షతో పాటు రూ.12,500 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా వాహనదారులు తమ ప్రాణాలతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడుతున్నారని తెలిపారు. మద్యం మత్తులో, అతివేగంగా, నిర్లక్ష్యంగా లేదా ప్రమాదకరంగా వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కోర్టు ద్వారా శిక్షలు పడేలా చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనం నడపాలని సూచించారు.



## అవినీతి నిరోధక శాఖ అధికారులు అదుపులో సోమశిల 6వ డివిజన్ అధికారులు

**రైతువద్ద నాలుగు లక్షలు లంచం డిమాండ్ మూడు లక్షలు తీసుకుంటూ పట్టుపడ్డ తెలుగుగంగ అవినీతి అనకొండలు కలువాయి మండలం కనుపూరు పల్లి,గార్లపాడు చెందిన రైతు చిరంజీవి తన స్థలం వద్ద తెలుగు కాలువపై కల్వర్టు నిర్మించుకునేందుకు ఎన్ఓసి కోరగా నాలుగు లక్షలు లంచం అడిగిన తెలుగుగంగ అధికారులు**

నెల్లూరు బ్యూరో చీఫ్ ఆగస్టు 27 నంది పత్రిక

నెల్లూరు నగరం పొదలకూరు రోడ్డులో గల సోమశిల నీటిపారుదల కార్యాలయం పై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు,కలువాయి మండలం కనుపూరు పల్లి,గార్లపాడు చెందిన అంబటి చిరంజీవి అనే రైతు తన పొలం వద్ద వున్న సోమశిల కాలువపై కల్వర్టు నిర్మించుకునేందుకుగాను ఆ శాఖ అధికారులను ఎన్ ఓ సి కోరగా నాలుగు లక్షల డిమాండ్ చేసినట్టు దీంతో రైతు ఏసీబీ అధికారులును సంప్రదించి నేడు మూడు లక్షలు లంచం ఇస్తుండగా, ఇరిగేషన్ శాఖకు చెందిన ఈ ఈ మహేష్ .. డి ఈ గౌతమ్ సుమన్ ఏ ఈ ఎం నారాయణ రాజు

రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు, పట్టుకున్న సొమ్మును సీజ్ చేసి కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతుంది...



## బయ్యారంలో సర్ ఫేజ్ 2 గ్రామసభ విజయవంతం



బయ్యారం మేజర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక ఓటర్ సవరణ సర్ ఫేజ్ 2 గ్రామసభ విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమక్షంలో ఓటర్ జాబితాను ప్రదర్శించి,ఓటర్ల వివరాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలను పరిశీలించడం జరిగిందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగుల ఉమా,డిప్యూటి తహసీల్దార్ సునీల్,పంచాయతీ సెక్రటరీ రాంబాబు,బయ్యారం మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య,మాజీ బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి,తాటి జనార్ధన్, రంజిత్, వార్డు సభ్యురాలు ఎట్టి.శరీత, బిఎల్ఓలు, ప్రజాప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నార్ను

## నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శ





నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గేదె కరుణాకర్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం రుద్రగూడె ంలోని మృతుని నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కరుణాకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కరుణాకర్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, ఆ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కొత్తపేట సర్పంచ్



బయ్యారం మండలంలోని కొత్తపేట గ్రామ కాంగ్రెస్ నాయకులు రామాచారి-రాజ్యలక్ష్మి దంపతుల కుమార్తె అనూష - రాకేష్ వివాహ వేడుకలు వేణిగళ్ళ జగ్గయ్య ప్రజా వేదికలో గురువారం ఘనంగా జరిగాయి.ఆద్యంతం వైభవంగా, సంబురంగా జరిగిన పెళ్లి వేడుకలకు కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ హాజరై నూతన వధూవరు లకు ఆశీర్వదించారు.సర్పంచ్ వెంట ఉపసర్పంచ్ రావి వీరభద్రరావు, భాస్కర్, బాలకృష్ణ, పుల్లయ్య,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# పట్టు సాగులో సాంకేతికతే ప్రామాణికం

పట్టు సాగులో శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతికతలను అవలంబించడం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని కేంద్ర పట్టు బోర్డు (సీఎస్‌బీ) శాస్త్రవేత్త భువన ఎస్. అన్నారు. గురువారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో పట్టు పరిశ్రమ శాఖ సమన్వయంతో నిర్వహించిన ‘ఎంఆర్ఎంఏ 2.0’ రైతుల శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు పలు కీలక అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

**ప్రభుత్వ పథకాలు - సబ్సిడీలు**

పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సబ్సిడీలు, మౌలిక వసతుల కల్పన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తద్వారా సాగు ఖర్చు తగ్గి, నికర ఆదాయం పెరుగుతుందని తెలిపారు.

**నేల ఆరోగ్యం - సారాభివృద్ధి**

సాంప్రదాయ పంటల నుంచి మల్బరీ సాగుకు మారే ముందు నేల పరీక్షలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. సేంద్రియ పదార్థాల వాడకం, సరైన పోషక యాజమాన్యంతో నేల సారాన్ని పెంచుకుంటేనే నాణ్యమైన ఆకులు, తద్వారా ఆరోగ్యకరమైన పట్టు పురుగుల పెంపకం సాధ్యమవుతుందని వివరించారు.



**నాన్-స్పిన్నింగ్ నివారణ**

పట్టు పురుగుల పెంపకంలో ఎదురయ్యే నాన్-స్పిన్నింగ్ సమస్యపై రైతులకు అవగాహన కల్పించారు. షెడ్లలో అనుకూల ఉష్ణోగ్రత, తేమ నిర్వహణ, సమయానుకూల మేత, పరిశుభ్రత పాటించడం ద్వారా పంట నష్టాన్ని నివారించి, నాణ్యమైన కోకూన్లను ఉత్పత్తి చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి బి. రజిత, ఏఈవో రాకేష్ మాట్లాడుతూ. వ్యవసాయ, పట్టు పరిశ్రమ శాఖల సమన్వయంతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ శిక్షణా శిబిరంలో పట్టు పరిశ్రమ శాఖ సహాయ సంచాలకులు తిరుపతి రెడ్డి, సెరికల్చర్ అధికారి మల్లయ్యలతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతులు తమ క్షేత్రస్థాయి సందేహాలను శాస్త్రవేత్తలతో నివృత్తి చేసుకున్నారు.

## కొత్తపేట సెక్షన్‌లో మెరుగైన విద్యుత్ సరఫరాకు అధికారులు చేపట్టిన చర్యలు



బయ్యారం మండలంలోని కొత్తపేట సెక్షన్‌కు జూలై నెలలో రఫీఉద్దీన్ ఏఈగా బాధ్యతలు బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు చేపట్టినప్పటి నాటి నుండి మండలంలోని విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయాలను ముందుగానే గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఏఈ తెలిపారు.ఈ సందర్భంగా రఫీఉద్దీన్ మాట్లాడుతూ ముఖ్యంగా మహబూబాబాద్ నుండి బయ్యారం సబ్‌స్టేషన్‌కు వచ్చే 33/11 కేవీ గుండ్రాతిమడుగు ఫీడర్‌పై ఉన్న చెట్ల కొమ్మల వల్ల ఏర్పడే అంతరాయాలను గుర్తించి,సిబ్బంది సహకారంతో వాటిని తొలగించడం జరిగిందన్నారు. అదేవిధంగా బయ్యారంలో రామాలయం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న ఓవర్‌లోడ్ సమస్యను గుర్తించి,ఆ లోడ్‌ను బొడ్రాయి సమీపంలోని డీటీఆర్ కు డైవర్ట్ చేసి లోడ్‌ను బ్యాలెన్స్ చేయడం ద్వారా ఓవర్‌లోడ్ సమస్యకు పరిష్కారం చూపమన్నారు. అలాగే కొత్తపేట సబ్‌స్టేషన్‌కు వచ్చే డోర్నకల్ 33 కేవీ లైన్‌లోని అంతరాయాలను గుర్తించి, వాటిని సరిచేయడం ద్వారా కొత్తపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయాలను తగ్గించడం జరిగిందన్నారు. ఓవర్‌లోడ్‌కు గురవుతున్న డీటీఆర్ లను గుర్తించి, అవసరమైన చోట అదనపు డీటీఆర్ లను ఏర్పాటు చేయడం ద్వారా అన్ని గ్రామాలకు నిరంతరాయంగా,నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే దిశగా చర్యలు కొనసాగిస్తున్నారు.డిఈ సూచనల మేరకు,ఏడిఈ పర్యవేక్షణలో ఇప్పటివరకు 93 లీనెడ్ పోల్స్ సరిచేయడం,86 లూస్ లైన్ సమస్యలను పరిష్కరించడం,166 స్పేసర్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమాలన్ని సబ్ ఇంజనీర్ సందీప్,స్టాఫ్ సహకారంతో నిర్వహించినట్లు ఏఈ తెలిపారు.ముమ్ముందు కొత్తపేట సెక్షన్ పరిధిలో ఏవైనా విద్యుత్ సమస్యలు మా దృష్టికి వచ్చిన వెంటనే వాటిని గుర్తించి,త్వరితగతిన పరిష్కరించే దిశగా



నిరంతరం కృషి చేస్తామని ఏఈ తెలిపారు.

# 7న ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయాలి

సెప్టెంబర్ 7న నిర్వహించనున్న చలో ఐటీడీఏ ఏటూరునాగారం ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా. మైపతి అరుణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈసం సుధాకర్ పిలుపునిచ్చారు. తుడుందెబ్బ రాష్ట్రంలోని నాలుగు ఐటీడీఏల ముట్టడి కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాకాల కొత్తగూడ మండలంలోని గుంజేడు ముసలమ్మ సన్నిధిలో గురువారం ఆదివాసీ మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముందుగా పూజారి తొలేం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతంలోని 29 శాఖల్లో ఆదివాసీ నిరుద్యోగుల కోసం 29 ప్రత్యేక జీవోలు తీసుకువచ్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో 57 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్



అమలు చేయాలని కోరారు. కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 75 శాతం ఏజెన్సీ ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే దక్కేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాలకు ప్రత్యేక డీఎస్సీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీల విద్య, ఉద్యోగ అవకాశాలకు నష్టం జరుగుతోందని నాయకులు ఆరోపించారు. ఎస్టీ జాబితాలో లంబాడీల చేరిక కారణంగా గత 50 ఏళ్లుగా ఆదివాసీల విద్యా, ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని వారు పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచి ఐటీఐ, నీట్, క్లాట్, విశ్వవిద్యాలయ విద్య వరకు, అలాగే వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో ఆదివాసీలకు న్యాయం జరగడం లేదని అన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, తమ డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న సెప్టెంబర్ 7 చలో ఐటీడీఏ ఏటూరునాగారం ఆదివాసీ మార్చ్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ ఉపాధ్యక్షుడు పోడెం బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడగ నాగేష్, ఏఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, ప్రధాన కార్యదర్శి కోర్నిబెల్లి గణేష్, జిల్లా నేతలు తాటి సునీల్, ఉద్యోగ నేతలు కల్తీ ఎల్లయ్య, చాట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటరు జాబితాలో తప్పులుంటే సరిచేసుకోవాలి

ముసాయిదా ఓటరు జాబితాలో తప్పులుంటే సరిచేసుకోవాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న తెలిపారు. దామెర మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రజల పరిశీలనకు ఉంచి, ఓటర్ల వివరాల్లో ఉన్న తప్పులు, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒగ్లాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు పరకాల ఆర్డీఓ డీఎస్ వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముసాయిదా ఓటరు జాబితా ఇప్పటికే ప్రకటించబడిందని తెలిపారు. జాబితాలో 179 మంది ఓటర్ల పేర్లు, తండ్రి పేర్లు తదితర వివరాల్లో తప్పులు గుర్తించినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఆరుగురు ఓటర్ల మ్యాపింగ్



పూర్తికాకుండా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. తప్పులు గుర్తించిన ఓటర్లకు సంబంధించి నోటీసులు అందజేస్తున్నామని ఆర్డీఓ తెలిపారు. నోటీసులు అందుకున్న వారు అందులో సూచించిన తేదీన సంబంధిత విచారణకు తప్పనిసరిగా హాజరై తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు, తండ్రి పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని కోరారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి, ఆర్ఐ రాధాకృష్ణ, సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, జీపీఓ హరిప్రసాద్, సూపర్‌వైజర్ శ్రీమాత, బీఎల్ఓలు, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ఉన్న కొన్నిపీహెచ్‌సీలలో కామాంధుల 'రాసలీలలు': మహిళా నర్సులపై వేధింపులు, కొన్నవ గ్రామస్తుల ఆగ్రహం!

వరంగల్ జిల్లాలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు విధి నిర్వహణను మరిచి కొందరు పురుష అధికారుల అక్రమాలకు, రాసలీలలకు నిలయంగా మారాయనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన పవిత్రమైన ఆరోగ్య కేంద్రాల్లో, కొందరు మగ అధికారులు తమ అధికార బలంతో పరిమితులు దాటుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. కన్నీటి పర్యంతమవుతున్న మహిళా నర్సులు ఈ ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే ఆడ నర్సులు మరియు ఇతర మహిళా సిబ్బందిని కొందరు పురుష అధికారులు పలు రకాలుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. విధుల నెపంతో వేధింపులకు పాల్పడుతుండటంతో, ఉద్యోగం ఊడుతుందేమోనన్న భయంతో బాధితులు ఎవరికీ



చెప్పుకోలేక తీవ్ర భయాందోళనలతో కన్నీరుమున్నీరవుతున్నారు. రక్షణ కల్పించాల్సిన చోటే తమకు ఈ దుస్థితి ఎదురవుతుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రాని డ్యూటీకి 'బరాబర్' హాజరు! సమయపాలన పాటించకపోయినా, అసలు విధులకు హాజరు కాకపోయినా కొన్ని కేంద్రాల్లో హాజరు రికార్డులు మాత్రం బరాబర్‌గా పడిపోతున్నాయి.

పనివేళల్లో ఆసుపత్రి ప్రాంగణంలోనే అనైతిక చర్యలకు పాల్పడుతూ ప్రజారోగ్యాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామీణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, ఐవీడిఎూ తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రజలు అంటున్నారు ఈ అక్రమాలు మరియు మహిళా సిబ్బందిపై జరుగుతున్న వేధింపుల వ్యవహారంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి ఎం హెచ్ ఓ వెంటనే జోక్యం చేసుకోవాలని కొన్నవ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పూర్తిస్థాయి ఉన్నత విచారణ జరిపి, విధులను విస్మరిస్తూ వేధింపులకు పాల్పడుతున్న అధికారులను, పురుష సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులు గట్టిగా కోరుతున్నారు.

# పాలనకు కేంద్ర బిందువులుగా పంచాయతీ కార్యాలయాలు

గ్రామపంచాయతీ కార్యాలయాలు స్థానిక పాలనకు కేంద్ర బిందువులుగా నిలవాలని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం ములుగు మండలంలో నూతనంగా ఏర్పాటైన బంజరుపల్లి గ్రామపంచాయతీకి ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన నూతన కార్యాలయ భవనాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతోపాటు పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.



గ్రామపంచాయతీ కార్యాలయాల ద్వారా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామస్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని



సూచించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# హిమాలయాల్లో ఏం జరిగింది..? నేపాల్‌లో వరదలకు కారణమేంటి..

హిమాలయాల్లో వేగంగా కరుగుతున్న గ్లేషియర్లు, పెరుగుతున్న హిమ సరస్సులు, కొండచరియలు, ఆకస్మిక వరదల ముప్పు ఆందోళన కలిగిస్తోంది. నేపాల్-టిబెట్ సరిహద్దులో తాజా వరదల నేపథ్యంలో గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ అంటే ఏమిటి? హిమాలయాల్లో వరదలు వస్తే భారత్‌లో ఏ రాష్ట్రాలకు ముప్పు ఉంటుంది? వరదల ప్రభావం ఎలా దిగువ ప్రాంతాలకు విస్తరిస్తుంది? ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, పర్యవేక్షణతో నష్టాన్ని ఎలా తగ్గించవచ్చో ఈ కథనంలో తెలుసుకోండి. హిమాలయాలు అంటే మంచు కొండలు. గ్లేషియర్లు. ప్రపంచంలోని కోట్లాది మందికి జీవనాధారం అందించే నదుల పుట్టినిల్లు. కానీ ఇప్పుడు ఇదే హిమాలయ ప్రాంతం వాతావరణ మార్పులతో ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. మంచు వేగంగా కరుగుతోంది. గ్లేషియర్లు వెనక్కి తగ్గుతున్నాయి. కొత్తగా ఏర్పడుతున్న హిమ సరస్సులు ఉబ్బిపోతున్నాయి. కొండచరియలు, మంచు చరియలు విరిగిపడి..ఆకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. తాజాగా నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన ఘోర వరదలు ఈ ప్రమాద తీవ్రతను మరోసారి ప్రపంచం ముందు ఉంచాయి.

**నేపాల్‌లో తాజా విలయం**

ఆగస్టు 26, 2026న నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో భారీ వరదలు, మట్టి ప్రవాహాలు విధ్వంసం సృష్టించాయి. గ్లేషియర్‌లోని మంచు, రాళ్లు ఒక్కసారిగా కూలిపోయి భారీ నీటి ప్రవాహం ఏర్పడిందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. భోటే కోసి నది లోయలోకి దూసుకొచ్చిన వరదలు గ్రామాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులను ధ్వంసం చేశాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. పెద్ద సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో విదేశీయులు, పర్యాటకులు, యాత్రికులు కూడా ఉన్నారు. ఈ ఘటనకు భూకంపమే కారణమన్న తొలినాటి అనుమానాలను తర్వాతి పరిశీలనలు బలపరచలేదు. గ్లేషియర్ కూలిపోవడం, మంచు-రాళ్ల ప్రవాహం, నదిలో ఒక్కసారిగా భారీ నీటి ఉద్ధృతి కలిసి ఈ విపత్తుకు కారణమైందని నిపుణుల అంచనాలు సూచిస్తున్నాయి. దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు సహాయక చర్యలకు కూడా పెద్ద అవరోధంగా మారాయి.

**ఇది కొత్త పరిణామం కాదు**

హిమాలయాల్లో ఇటువంటి విపత్తులు గతంలోనూ వచ్చాయి. 2021లో ఉత్తరాఖండ్‌లోని చమోలీ ప్రాంతంలో మంచు-రాళ్ల ప్రవాహం, వరదలతో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 2023లో సిక్కింలోని సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగి గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్---లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. 2024లో నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలతో వందల మంది మరణించారు. అదే ఏడాది నేపాల్‌లోని థామే ప్రాంతంలో గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ వచ్చి ఇళ్లు, హోటళ్లు, పాఠశాల, ఆరోగ్య కేంద్రం సహా అనేక నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. 2025లోనూ నేపాల్-టిబెట్ సరిహద్దులో భారీ వరదలు ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించాయి. ఈ వరుస ఘటనలు ఒక విషయాన్ని చెబుతున్నాయి. హిమాలయాల్లో గ్లేషియర్లు, హిమ సరస్సుల పరిస్థితిని ముందుగానే గుర్తించి ప్రమాదాన్ని అంచనా వేయడం అత్యవసరం అని సూచిస్తున్నాయి.

**ముప్పు ఎందుకు పెరుగుతోంది ?**

ప్రధాన కారణాల్లో వాతావరణ మార్పు ఒకటి. ఉష్ణోగ్రతలు పెరగడంతో హిమాలయ గ్లేషియర్లు వేగంగా కరుగుతున్నాయి. గ్లేషియర్లు వెనక్కి తగ్గే కొద్దీ వాటి ముందు, పక్క ప్రాంతాల్లో నీటితో నిండిన కొత్త సరస్సులు ఏర్పడుతున్నాయి. ఈ సరస్సులను చాలాసార్లు మంచు, రాళ్లు, మట్టి వంటి సహజ పదార్థాల బలహీన అడ్డంకులు నిలిపి ఉంచుతాయి. ఆ అడ్డంకులు తెగిపోతే ఒక్కసారిగా భారీ నీటి ప్రవాహం దిగువ ప్రాంతాలకు దూసుకొస్తుంది. దీనినే గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్.. అంటారు. హిమాలయ-కారకోరం ప్రాంతంలో గతంలోనే వందలాది +గాళీ ఘటనలు నమోదయ్యాయి. గ్లేషియర్ల వెనుకడుగు, హిమ సరస్సుల విస్తరణతో ప్రమాదం మరింత పెరుగుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్రమాదకర హిమ సరస్సుల సమీపంలో, వాటి దిగువ నదీ లోయల్లో నివసించే లక్షలాది మంది ప్రజలు నేరుగా ముప్పును ఎదుర్కొనే పరిస్థితి ఉంది.

**హిమాలయాలు ఎంత ఎత్తులో ఉన్నాయి?**

హిమాలయాల ఎత్తు ప్రాంతాన్ని బట్టి భారీగా మారుతుంది. పర్వత పాద ప్రాంతాలు కొన్ని వందల మీటర్ల ఎత్తులో ఉండగా.. ఎత్తైన హిమాలయ ప్రాంతాల్లో 5,000 నుంచి 6,000 మీటర్లకు పైగా ఎత్తులు సాధారణం. ఎవరెస్ట్ వంటి శిఖరాలు 8,000 మీటర్లకు పైగా ఎత్తులో ఉన్నాయి. ఉదాహరణకు సిక్కింలోని సౌత్ లోనాక్ గ్లేషియల్ లేక్ సుమారు 5,200 మీటర్ల ఎత్తులో ఉంది. 2023లో ఈ సరస్సు ఉప్పొంగడంతో వచ్చిన వరద తీస్తా నది వెంట సిక్కిం నుంచి పశ్చిమ బెంగాల్ మీదుగా దిగువ ప్రాంతాల వరకు ప్రభావం చూపింది. ఇక్కడే అసలు ప్రమాదం దాగి ఉంది. వరద పుట్టే ప్రదేశం వేల మీటర్ల ఎత్తులో ఉండొచ్చు.. కానీ నష్టం ఎక్కువగా జరిగేది దిగువ నదీ లోయల్లోనే.

**వరద వస్తే మొదట ప్రభావితమయ్యే ప్రాంతం ఏది?**

సాధారణంగా లేదా గ్లేషియర్ కూలిన ఘటనలో వరద ప్రభావం కిందికి వస్తుంది. గ్లేషియర్ / హిమ సరస్సు ? పర్వత లోయ ? ఉపనది ? ప్రధాన నది ? నదీ తీర గ్రామాలు ? దిగువ మైదాన ప్రాంతాలు ఇలా వరుస ఉంటోంది. అంటే మొదటి దెబ్బ గ్లేషియర్‌కు దిగువన ఉన్న ఇరుకైన పర్వత లోయలు, నదీ తీర గ్రామాలు, వంతెనలు, రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులకు తగులుతుంది. నీటితో పాటు మంచు, బండరాళ్లు, మట్టి, చెట్ల దుంగలు కూడా కొట్టుకొస్తే విధ్వంసం మరింత పెరుగుతుంది. నీటి ప్రవాహం నది వెంట దిగువకు వెళ్లేకొద్దీ ప్రభావిత ప్రాంతం విస్తరిస్తుంది. అందుకే పర్వతాల్లో ప్రారంభమైన విపత్తు కొన్ని గంటల్లోనే దిగువ ప్రాంతాలకు చేరే ప్రమాదం ఉంటుంది.

**భారత్‌లో ఏ రాష్ట్రాలకు ముప్పు?**

హిమాలయాల్లో వచ్చే వరదలకు భారతదేశంలో ప్రధానంగా సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లడఖ్ ప్రాంతాలు నేరుగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. అయితే వరద నీరు నదుల వెంట దిగువకు ప్రవహించడంతో పశ్చిమ బెంగాల్, అసోం వంటి మైదాన రాష్ట్రాలపైనా ప్రభావం పడొచ్చు.

టిబెట్‌లో పుట్టే అనేక నదులు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. యార్లుంగ్ సాంగ్పో భారత్‌లోకి వచ్చిన తర్వాత సియాంగ్‌గా.. ఆపై అసోంలో బ్రహ్మపుత్రగా ప్రవహిస్తుంది. మరోవైపు తీస్తా వంటి నదులు సిక్కిం, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల హిమాలయాల్లో వరద అంటే పర్వత ప్రాంతానికే పరిమితమైన సమస్య కాదు.. నదీ ప్రవాహం ఎక్కడివరకు వెళ్తుందో అక్కడివరకు ముప్పు విస్తరించే అవకాశం ఉంటుంది.

**ఎంత మేరకు నష్టం?**

నష్టం ఎంత ఉంటుందనేది వరద పరిమాణం, నది వెడల్పు, లోయ ఆకారం, దిగువన ఉన్న జనాభా, వంతెనలు, డ్యామ్‌లు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది2023 సిక్కిం సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగడంతో తీస్తా నదిలో నీటి మట్టం ఒక్కసారిగా భారీగా పెరిగింది. ఈ విపత్తులో ప్రాణ నష్టం సంభవించడంతో పాటు వంతెనలు, రహదారులు, భవనాలు, విద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 1,200 మెగావాట్ల తీస్తా జలవిద్యుత్ ప్రాజెక్టు కూడా తీవ్రంగా ప్రభావితమైంది. వేలాది మంది ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమయ్యారు. 2021 చమోలీ, ఉత్తరాఖండ్ చమోలీలో సంభవించిన ఆకస్మిక వరదలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు లేదా గల్లంతయ్యారు. జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు, వంతెనలు, నదీ లోయల్లోని మౌలిక సదుపాయాలు భారీగా దెబ్బతిన్నాయి. ఈ రెండు ఘటనలు చెబుతున్న సందేశం ఒక్కటే---ప్రాణ నష్టంతో పాటు విద్యుత్, రవాణా, వ్యవసాయం, పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థలపైనా భారీ ప్రభావం పడుతుంది.

**భారత్‌కు ఎందుకు ప్రత్యేక ముప్పు?**

భారత్‌లోని హిమాలయ రాష్ట్రాల్లో అనేక పట్టణాలు, గ్రామాలు, రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులు నదీ లోయలకు సమీపంలోనే ఉన్నాయి. పర్యాటకం పెరగడం, రహదారులు విస్తరించడం, కొండ ప్రాంతాల్లో నిర్మాణాలు పెరగడం వల్ల ప్రమాద సమయంలో ప్రభావితమయ్యే ఆస్తుల విలువ కూడా పెరుగుతోంది. ఒక గ్లేషియర్ లేదా హిమ సరస్సు నుంచి అకస్మాత్తుగా నీరు విడుదలైతే.. అది కేవలం నీరు కాదు. నీటితో పాటు రాళ్లు, మట్టి, మంచు, చెట్లు, నిర్మాణాల అవశేషాలు కూడా దిగువకు కొట్టుకొచ్చే అవకాశం ఉంది. దీంతో సాధారణ వరద కంటే మరింత విధ్వంసకరంగా మారుతుంది.ముందస్తు జాగ్రత్తలే రక్షణ ఇలాంటి విపత్తులను పూర్తిగా ఆపడం సాధ్యం కాకపోయినా.. నష్టాన్ని గణనీయంగా తగ్గించడం మాత్రం సాధ్యమే. ప్రమాదకర హిమ సరస్సులను ఉపగ్రహాలు, డ్రోన్లు, రిమోట్ సెన్సింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలి. సరస్సుల్లో నీటి మట్టం, మంచు గోడల స్థిరత్వాన్ని కొలిచే సెన్సర్లను ఏర్పాటు చేయాలి. అత్యంత ప్రమాదకర సరస్సుల్లో అవసరమైన చోట నియంత్రితంగా నీటిని తగ్గించే చర్యలు చేపట్టాలి. అంతకంటే ముఖ్యంగా ఎర్లీ వార్నింగ్ సిస్టమ్‌లను బలోపేతం చేయాలి. ఎగువ ప్రాంతాల్లో ప్రమాద సంకేతాలు గుర్తించిన వెంటనే దిగువ గ్రామాలకు సైరన్లు, మొబైల్ అలర్టులు, రేడియో, ఇతర కమ్యూనికేషన్ మార్గాల ద్వారా సమాచారం చేరాలి. స్థానిక ప్రజలకు ముందుగానే శిక్షణ ఇవ్వాలి. ఎక్కడికి వెళ్లాలి.. ఏ మార్గంలో వెళ్లాలి.. ఏ ప్రాంతాలను తప్పించుకోవాలి అనే విషయాలపై స్పష్టమైన ఎమర్జెన్సీ ప్లాన్ ఉండాలి. రహదారులు, వంతెనలు, డ్యామ్‌లు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంలో హిమ సరస్సులు, వరద మార్గాలు, కొండచరియల ప్రమాదాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి.

**సరిహద్దులు దాటే విపత్తుకు.. సరిహద్దులు లేని పరిష్కారం**

హిమాలయాలు భారత్, నేపాల్, భూటాన్, చైనా వంటి అనేక దేశాలకు సాధారణ సహజ వ్యవస్థ. ఒక దేశంలో గ్లేషియర్ కదలిక లేదా హిమ సరస్సు ఉప్పొంగడం మరో దేశంలోని నదీ ప్రవాహాన్ని ప్రభావితం చేయవచ్చు. అందుకే ఉపగ్రహ డేటా, వాతావరణ సమాచారం, హిమ సరస్సుల పరిస్థితి, నదీ నీటి మట్టాలు, వరద హెచ్చరికలను దేశాల మధ్య వేగంగా పంచుకునే వ్యవస్థ అవసరం. అదే సమయంలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడం, హిమాలయాల సున్నిత పర్యావరణ వ్యవస్థను కాపాడటం కూడా దీర్ఘకాలిక పరిష్కారంలో భాగం కావాలిచివరగా.. హిమాలయాల్లో మంచు కరుగుతోంది. కొండలు అస్థిరమవుతున్నాయి. హిమ సరస్సులు పెరుగుతున్నాయి. ఆకస్మిక వరదల ముప్పు విస్తరిస్తోంది. నేపాల్-టిబెట్ సరిహద్దులో తాజా విషాదం ఒక ప్రాంతానికి మాత్రమే సంబంధించిన ఘటన కాదు. హిమాలయాలు వేడెక్కితే.. ఆ ప్రభావం పర్వతాల నుంచి మైదానాల వరకు.. నదుల నుంచి కోట్లాది ప్రజల జీవనంపై పడే అవకాశం ఉంది. హిమాలయాల్లో వరద పుట్టేది ఎత్తైన పర్వత ప్రాంతాల్లో.. మొదటి దెబ్బ తగిలేది గ్లేషియర్ దిగువన ఉన్న నదీ లోయలకు.. ఆ తర్వాత నదీ తీర గ్రామాలు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రభావితమవుతాయి.. చివరికి నది ప్రవాహం దిగువ మైదాన ప్రాంతాలకు చేరుతుంది. అందుకే వరద పుట్టేది పర్వతాలపై.. మొదటి దెబ్బ నదీ లోయలకు.. తర్వాత నదీ తీర గ్రామాలకు.. చివరికి దిగువ మైదాన ప్రాంతాలకు అనే ప్రమాద గొలుసును ముందుగానే అర్థం చేసుకోవాలి. విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి, ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలి. ప్రమాద ప్రాంతాల్లో నిర్మాణాలను నియంత్రించి, దేశాల మధ్య సమాచారాన్ని పంచుకోవాలి. ఇవే హిమాలయ భవిష్యత్తును, అక్కడి ప్రజల ప్రాణాలను కాపాడే కీలక మార్గాలు.

# వాహనాలకు బహిరంగ వేలం

సారాయి, బెల్లం సరఫరా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సెప్టెంబర్ 1న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మహబూబాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ జి. చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ డిప్యూటీ కమిషనర్ హెచ్. దత్తురాజ్ గౌడ్, మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి పి. కరంచంద్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో డీపీఈఓ మహబూబాబాద్ ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించనున్నారు. వాహనం నిర్ణయించిన కనీస ధర (అప్సెట్ ప్రైస్)లో 50 శాతం మొత్తాన్ని డిపాజిట్‌గా చెల్లించాలి. వేలానికి సంబంధించిన వాహనాల వివరాలు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అందుబాటులో ఉంటాయని, ఆసక్తి ఉన్న వారు ముందుగా వాహనాలను పరిశీలించి వేలంలో పాల్గొనవచ్చని, వేలంలో వాహనం దక్కిన తర్వాత దానిని తీసుకోకుండా నిరాకరిస్తే డిపాజిట్ మొత్తాన్ని జప్తు చేస్తామని హెచ్చరించారు. వాహనం వేలంలో దక్కని వారికి డిపాజిట్ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని సమర్పించాలని, వేలానికి సంబంధించిన దరఖాస్తులను సెప్టెంబర్ 1 ఉదయం 10 గంటల వరకు మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు. వేలంలో వాహనం దక్కించుకున్న వారు అదే రోజు పూర్తి మొత్తాన్ని జీఎస్టీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



మండలంలోని ఊరుగొండ గ్రామంలో పీఏసీఎస్ (పెద్దాపూర్) చైర్మన్ బొల్లు రాజు నానమ్మ, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు బొల్లు భగవాన్ రెడ్డి.తల్లి బొల్లు కమలమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో గురువారం ఊరుగొండలోని బాధిత కుటుంబ సభ్యులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పరామర్శించారు.బొల్లు కమలమ్మ. చిత్రపటానికి పూలు నివాళులు ర్పించారు ,కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలేపాక శ్రీనివాస్ . గుడిపాటి శ్రీధర్ రెడ్డ. బొల్లు సమ్మిరెడ్డి. రవీందర్. విశ్వనాథం. నాయకులు పాల్గొన్నారుద,

# ఇంటర్ స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

మహబూబాబాద్ జిల్లా పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 29న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ కర్త ఉమా మహేశ్వరీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ బాలికల కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని గురుకుల కళాశాలల్లో మహబూబాబాద్ బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఫార్మా; తొర్రూరు బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ ; ఇనుగుర్తి బాలికల కళాశాలలో హెచ్‌ఈసీ, సీఈసీ: మరిపెడ బాలుర కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మార్చి 2026లో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో మొదటి దఫాలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలిపారు. అర్హులైన విద్యార్థులు టీసీ, మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్స్‌తో పాటు జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని సూచించారు.

## ప్రధాని మోదీ బలమైన సందేశం ఇచ్చారు: క్రికెటర్ తిలక్ వర్మ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువత, క్రీడాకారులతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో టీమిండియా టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ కూడా పాల్గొన్నాడు. 'ఖేలో ఇండియా డైలాగ్' పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఇచ్చిన సందేశంపై ఈ డాషింగ్ బ్యాటర్ ప్రశంసలు కురిపించాడు. క్రీడల ద్వారా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండవచ్చని, 2036 ఒలింపిక్స్‌లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ప్రధాని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com